సాక్షి 24|7

జగిత్యాల

సోమవారం 28-8-2017

లక్ష్యం పూర్తి చేయకుంటే

నిధులు నిలిపివేత

-2లో▸



మెట్‌పల్లి: మొక్కకు నీళ్లు పోస్తున్న కలెక్టర్ శరత్

దొంతాపూర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఎత్తిపోతల పథకం



కల సాకారమైన వేళ..!

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కల సాకరమైంది. అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోయి అల్లాడుతున్న రైతాంగానికి ఎత్తిపోతల పథకాలు ఎంతో ధైర్యాన్నిచ్చాయి. ఒక్క ఎకరం బీడు ఉండవద్దని భావించిన ప్రభుత్వం అందుకనుగుణంగా పనులు చేపట్టింది. ధర్మపురి మండలంలో రూ.71 కోట్లతో చేపట్టిన ఐదు ఎత్తిపోతల పథకాల పనులు పూర్తి కాగా.. నేడు మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ ప్రారంభించనున్నారు. దీంతో బీడుభూములు సస్యశ్యామలం కానున్నాయి.

పథకం	నిధులు(రూ.కోట్లలో)	ఆయకట్టు(ఎకరాల్లో)
రాయపట్నం	13	1300
తిమ్మాపూర్	19.20	2300
రాజారం	10	1200
జైనా	11	1100
దొంతాపూర్	18.30	2000

- ఎత్తిపోతలకు మోక్షం
- ఐదు పథకాలకు రూ.71 కోట్లు
- 12 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు
- మంత్రుల చేతుల మీదుగా నేడు ప్రారంభం
- సస్యశ్యామలం కానున్న బీడు భూములు



హరీశ్‌రావు



ఈటల రాజేందర్

ధర్మపురి: మండలంలోని గోదావరి తీరాల్లోని రాయపట్నం, తిమ్మాపూర్, రాజారం, జైనా దొంతాపూర్ గ్రామాల్లో 2012లో ఎత్తిపోతల పథకాలకు బీజం పడింది. పనులు రెండు సంవత్సరాల్లో పూర్తిచేయాలని నిర్ణయించారు. ఆర్‌డీఎఫ్ పథకం కింద మొత్తం ఆరు పథకాలకు ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రణాళిక నిధులు రూ.81కోట్లు మంజూరయ్యాయి. 2012లో ఎన్నికల ముందు తిమ్మాపూర్, ఎడవెల్లి గ్రామాల్లో పథకాలు పనులు ప్రారంభం కాగా.. అనంతరం జైనా, రాజారం, దొంతాపూర్, రాయపట్నం గ్రామాల్లో పనులు ప్రారంభించారు. 2014–15లోపు ముగించాలని సర్కార్ గడువిచ్చింది. అయితే కొన్ని కారణాలతో జాప్యం జరిగింది.

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం..

ఎత్తిపోతల పథకాల పనులపై నెల

- మిగతా 2లో▸

నో పర్మిషన్

- అనుమతులు లేని ఆస్పత్రుల హవా
- ఇష్టారాజ్యంగా ఏర్పాటు..
- నిబంధనలు పాటించని ల్యాబ్‌లు
- నోటీసులు జారీచేసిన వైద్యశాఖ అధికారులు



వైద్యం వ్యాపారమైంది... చేతులెత్తి మొక్కాలనిపించే డాక్టర్లు కొందరు ధనార్జనే ధ్యేయంగా ఆలోచిస్తున్నారు. ప్రయివేటు వైద్యులు ఎలాంటి అనుమతులు లేకుండానే కార్పొ‘రేట్’ ఆస్పత్రులు నెలకొల్పుతున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మొత్తం 70 నర్సింగ్ ఆస్పత్రులు ఉండగా.. 160 మంది డాక్టర్లు ఉన్నారు. ఇందులో 80శాతం వరకే అనుమతులున్న డాక్టర్లు.. మిగతావారు యథేచ్ఛగా వైద్యవ్యాపారం చేస్తున్నారు. ఇప్పటికే వైద్యశాఖ అధికారులు పలువురికి నోటీసులు జారీచేశారు.

-జగిత్యాల

- వివరాలు 2లో▸

ఆకలి కేకలు..

- ఆకలి అవుతోంది.. అన్నం పెట్టండి..!
- మైనార్టీ గురుకులంలో విద్యార్థుల అవస్థలు
- మధ్యాహ్నం 3గంటలకు భోజనం పెట్టిన వైనం
- అదీ సగం కడుపుకే..
- ఆకలి తట్టుకోలేక మీడియాకు సమాచారం
- విచారణకు ఆదేశించిన ఇన్‌చార్జి డీఎండబ్ల్యూవో నరేందర్
- నివేదిక ఇచ్చిన మహమూద్ అలీ అఫ్సర్



భోజనం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

సాక్షి, జగిత్యాల:

జిల్లాకేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల విద్యార్థులు ఆదివారం ఆకలితో అలమటించారు. మధ్యాహ్నం 12:30లకే భోజనంచేసే విద్యార్థులు కడుపు పట్టుకుని 3:30 గంటల వరకు ఓపిక పట్టారు. సమయం దాటినా భోజనం పెట్టకపోవడంతో ప్లేట్లు చేతిలో పట్టుకుని ఎదురుచూశారు. తీరా.. 3:10 గంటలకు భోజనం వడ్డించడం ప్రారంభించిన గురుకుల సిబ్బంది సగం కడుపుకే పెట్టడంతో దానితోనే సరిపెట్టుకున్నారు. వారిలో ఓ విద్యార్థి మరో వ్యక్తితో కలిసి నేరుగా ‘సాక్షి’కి ఫోన్ చేశాడు. ‘ఆకలి అవుతోంది.. మా స్కూళ్లో అన్నం పెడ్తలేరు.. మీరొస్తారా..?’ అని ప్రాధేయపడ్డాడు. దీంతో ఫోన్‌చేసిన పది నిమిషాల్లోపే ‘సాక్షి’ అక్కడికి చేరుకుంది. ఆ సమయంలో విద్యార్థుల్లో కొందరు అన్నం తింటున్నారు. ఇంకొందరు విద్యార్థులు వచ్చి ‘సాక్షి’ ప్రతినిధిని చుట్టు చేరారు. ఆకలి అవుతున్నా.. అన్నం పెడ్తలేరని..

- మిగతా 2లో▸

ఆకలి కేకలు..

▶మొదటిపేజీ తరువాయి

ఎవరికైన చెబితే పెట్టమని బెదిరించారని విద్యార్థులు గురుకుల సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయాన్ని 'సాక్షి' మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి (డీఎండబ్ల్యూవో) గంటా నరేందర్‌కు ఫోన్‌లో వివరించింది. ఈక్రమంలో ఇద్దరు చిన్నారులు సైతం విషయాన్ని వివరించారు. వెంటనే స్పందించిన ఇన్‌చార్జి డీఎండబ్ల్యూవో అక్కడున్న వార్డెన్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే వెళ్లి విచారణ చేపట్టాలని కార్యాలయ సూపరింటెండెంట్ ముహమ్మద్ మహమూద్ అలీ అఫ్సర్‌ను ఆదేశించారు. దీంతో ఆయన అరగంటలోపే మైనార్టీ గురుకులానికి చేరుకున్నారు. 3:30 గంటల వరకూ అన్నం తినని విద్యార్థులు పలువురితో మాట్లాడారు. అలాగే గురుకుల ప్రిన్సిపాల్ మహేందర్, బోధన, బోధనేతర సిబ్బందితో మాట్లాడారు. భోజనం వడ్డించేందుకు జరిగిన జాప్యంపై ఆరాతీశారు. ఆదివారం చికెన్ బిర్యానీ వండాలని మెనూలో ఉందని.. చికెన్ ఆలస్యంగా రావడంతో ఆలస్యమైందని వంట నిర్వాహకులు చెప్పారు. అందరి వాదనలు నమోదు చేసుకున్న మహమూద్ అలీ డీఎండబ్ల్యూవో గంటా నరేందర్‌కు నివేదిక ఇస్తానని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని.. అవసరమైతే సస్పెండ్ చేస్తానని వివరణ ఇచ్చారు.

లక్ష్యం పూర్తిచేయకుంటే నిధులు నిలిపివేత

కోరుట్లరూరల్:హరితహారంలో నిర్దేశించిన లక్ష్యం పూర్తిచేయని గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను నిలిపివేస్తామని కలెక్టర్ శరత్ చెప్పారు. మండలంలోని ఎకీన్‌పూర్ గ్రామంలో మూడోవిడత హరితహారంలో భాగంగా ఎస్సారెస్పీ కెనాల్ ప్రాంతంలో ఆదివారం మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కోటి 32లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించామని, ఇప్పటివరకు 90లక్షల నాటామన్నారు. మిగిలిన లక్ష్యాన్ని వారం రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు నలువైపులా 2కిలోమీటర్ల పరిధిలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లక్ష్యం పూర్తిచేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. నాటిన మొక్కలను సంరక్షిస్తేనే హరిత తెలంగాణ సాధ్యమవుతుందని, క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు సూచించాలని అన్నారు.డీఆర్డీఏ పీడీ అరుణశ్రీ, సర్పంచ్ శంకర్‌రెడ్డి, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏపీడీ సుందర వరదరాజన్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్రావ్, వీఆర్వో సంధ్యారాణి, ఉప సర్పంచ్ జలందర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

మెట్‌పల్లి(కోరుట్ల): మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ శరత్ అన్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్‌లో ఆదివారం నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీత కార్మిక సొసైటీకి చెందిన స్థలంలో ఈత మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడుతూ మెట్లచిట్టాపూర్‌లో 42వేల గుంతలు ఏర్పాటు చేయగా, ఇప్పటివరకు 34,500 మొక్కలు నాటడం జరిగిందన్నారు. మిగిలిన 7500 మొక్కలను ఈ నెలాఖరులోగా నాటాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రజలు పెద్ద సంఖ్యలో హరితహారంలో భాగస్వాములవడం సంతోషకరమన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలునాటడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఆర్‌డీఏ పీడీ అరుణశ్రీ, కోరుట్ల తహసీల్దార్ సత్యనారాయణ, ఏపీడీ సుందరవరదరాజన్, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, ఎక్సైజ్ ఎస్సై చిరంజీవి, సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, నాయకులు మారు సాయిరెడ్డి తదితరులున్నారు.

సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి..

మెట్‌పల్లి: సేంద్రియ పద్ధతుల్లో పంటలను సాగు చేయడంపై రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ శరత్ సూచించారు. మెట్లచిట్టాపూర్‌లో రాజారాపు భూమేశ్వర్ సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. సాగుచేస్తున్న తీరు, పంట దిగుబడుల గురించిఅడిగి తెలుసుకున్నారు. భూమేశ్వర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

'ఊరటనిచ్చిన హైకోర్టు ఆదేశాలు'

జగిత్యాల: ఉద్యోగుల సర్వీస్‌ల సమస్యలపై హై కోర్టు ఆదేశాలు ఊరటనిచ్చాయని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసుల సంఘ గౌరవ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. రెవెన్యూ సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సర్వీసుల సమస్యలు పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలివ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. సమావేశంలో వకీల్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు

కల సాకారమైన వేళ..!

▶మొదటిపేజీ తరువాయి

క్రితం రాష్ట్రభారీ నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్‌రావు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నెల రోజుల్లో పనులు పూర్తిదశకు చేరాలని, లేకుంటే ఇంటికేనంటూ మందలించారు. దీంతో యంత్రాంగం కదిలింది. పనుల ప్రగతిపై చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ పలుమార్లు పరిశీలిస్తూ అధికారులను అప్రమత్తం చేయగా.. రాయపట్నం, తిమ్మాపూర్, రాజారం, జైనా, దొంతాపూర్‌లోని ఐదు పథకాల పనులుపూర్తిచేశారు. రూ.10కోట్లతో చేపట్టిన ఎడపెల్లి ఎత్తిపోతల పథకం పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రారంభోత్సవానికి నోచుకోలేక పోయింది.

నేడు ప్రారంభం

ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న ఎత్తిపోతల పథకాలకు మంచి రోజులొచ్చాయి. ఐదు ఎత్తిపోతల పథకాలకు భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు, ఆర్థికశాక మంత్రి ఈటల రాజేందర్‌తోపాటు ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ ప్రారంభోత్సవం చేయనున్నారు. వాటిలో రాయపట్నం, తిమ్మాపూర్ పథకాలను మంత్రుల చేతుల మీదుగా... దొంతాపూర్ , జైనా, రాజారం గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలను సమయంలేనందున సంబంధిత అధికారులు ప్రారంభిస్తారు.

పనులు పూర్తి చేస్తరని అనుకోలేదు



నాకు జైనాలో మూడు ఎకరాల భూమి ఉంది. ఐదు ఏండ్ల కింద ఎత్తిపోతల పనులు మొదలెటింద్రు. రేపూ మాపంటూ కాలం ఎల్లదీసింద్రు. పనులు పూర్తిచేత్తె పంటలకు నీరందుతుంది. నీళ్లులేక ఎగుసం బందుచేసి మేకలు మేపుతున్న. ఇప్పుడు ఎత్తిపోతల పనుల పూర్తితో పంటలకు నీరందుతుంది. ఎంతో సంతోషంగా ఉంది.

–తిరుపతి, రైతు, జైనా

ఎత్తిపోతల ఘనత సీఎందే..



ఎన్నికల ముందు రైతులకిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాం. ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది. సాగుకు నోచుకోక బీళ్లుగా మారిన భూములన్నీ ఎత్తిపోతలతో సస్యశ్యామలం కానున్నాయి. అందుకు సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు కృతజ్ఞతలు.

–కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ చీఫ్‌విప్

నో పర్మిషన్..!

జగిత్యాల: వైద్యం వ్యాపారంగా మారడంతో కొందరు ఇష్టానుసారంగా ఆస్పత్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడెక్కడి నుంచో డాక్టర్లను తీసుకొచ్చి మల్టీస్పెషాలిటీ పేరిట ఆస్పత్రులు కొనసాగిస్తున్నారు. ఎండీలు, ఎంఎస్‌లు, న్యూరోసర్జన్లతో ఆస్పత్రులు నడుపుతున్నారు. నిబంధనల ప్రకారం ఒక ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పుడు అందులో ఏయే వైద్యులున్నారు.. వారి వివరాలు వైద్యశాఖకు సమర్పించాల్సి ఉంటుంది. వారు అనుమతించిన అనంతరమే ఆస్పత్రిని కొనసాగించాలి. వాటన్నింటినీ బేఖాతర్ చేస్తూ జిల్లాలో ప్రయివేటు ఆస్పత్రులు కోకొల్లలుగా వెలుస్తున్నాయి.

నెలకో డాక్టర్...

ప్రయివేటు ఆస్పత్రుల్లో నెలకో డాక్టర్‌ను మారుస్తున్నారు. మొదట రిజిస్ట్రేషన్ చేయించుకున్న డాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయినా అతడి రిజిస్ట్రేషన్ పేరుమీదే వేరే డాక్టర్ కొనసాగుతున్నాడు.దీంతో ఆస్పత్రిలో అప్పుడు ఏ డాక్టర్ ఉన్నాడో తెలియని పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల్లోని కొందరు ఆర్‌ఎంపీలను మచ్చిక చేసుకుని వారి ద్వారా పేషెంట్లను తెప్పించుకుంటూ ఆస్పత్రులను కొనసాగిస్తున్నారు. ఆర్‌ఎంపీలకు కమీషన్లు అందజేయడం, విదేశీ టూర్లకు పంపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పరీక్ష ఫీజులు లెక్కేలేదు..

రోగమేదైనా.. టెస్టు తప్పనిసరైంది. రోగనిర్ధారణ పరీక్ష చేయనిదే డాక్టర్లు మందులు రాయడంలేదు. కొందరు వైద్యులైతే ఆస్పత్రిలోనే ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నారు. ప్రతిటెస్ట్‌కు ఫిక్స్‌డ్ రేటు నిర్ణయించి రోగుల దగ్గర ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. గోలితో పోయే దానికి మూత్రపరీక్ష, రక్తపరీక్ష చేస్తున్నారు. దీనికి రూ. 200 నుంచి 250 తీసుకుంటున్నారు. కాస్త రోగం ముదిరితే సిటిస్కాన్, ఎక్స్‌రేలు, ఎంఆర్‌ఐ తదితర పరీక్షలు చేస్తున్నారు. వీటికి రూ.4 వేల వరకు అవుతున్నాయి.

నిబంధనలు పాటించని ల్యాబ్ నిర్వాహకులు

ప్రతి ల్యాబ్‌లో నిబంధనల ప్రకారం ఏ పరీక్షకు ఎంత ఫీజు అనే బోర్డు ఏర్పాటు చేయాలి. అయితే ఆ నిబంధనలు ఎక్కడా పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. అర్హత లేని నిపుణులను ల్యాబ్‌ల్లో ఏర్పాటు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జగిత్యాలలోని కొందరు వైద్యులు తమ ఆస్పత్రులకే ల్యాబ్‌లను అనుబంధంగా పెట్టుకోగా.. మరికొందరు బయట ల్యాబ్‌లతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

అనుమతులు తప్పనిసరి..



జిల్లాలో ఎవరైనా ఆస్పత్రి ఏర్పాటు చేస్తే తప్పకుండా అనుమతి తీసుకోవాలి. వైద్యుల వివరాలు సైతం ఉంచాలి. వైద్యులు వెళ్లిపోతే నూతనంగా వచ్చిన వైద్యుల వివరాలను అందజేయాలి. జిల్లాలో ఇప్పటికే అనుమతి లేని ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశాం. అనుమతులు లేకపోతే చర్యలు తప్పవు.

-డాక్టర్ జైపాల్‌రెడ్డి, డెప్యూటీ డీఎంహెచ్‌వో

29న జానపద జాతర

- కలెక్టర్ శరత్

జగిత్యాల: ఈ నెల 29న జానపద జాతర –2017 నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శరత్ తెలిపారు. జన జీవనం, జాతి సాంస్కృతిక వారసత్వంలో అత్యంత కీలకమైన అభివ్యక్త రూపాలు జానపద కళారూపాలని అన్నారు. అంతర్జాతీయంగా వివిధ దేశాలు, ప్రభుత్వాలు ఆగస్టు 22న ప్రపంచ జానపద దినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంలో రాష్ట్రంలో సైతం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈ నెల 29న స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో సాయంత్ర 6నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ కళాబృందాలతో ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

రేపు క్రీడాపోటీలు

జగిత్యాలటౌన్: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29న జగిత్యాల మినీ స్టేడియంలో అండర్–17 బాలబాలికలకు బాస్కెట్ బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి శ్యాం ప్రకాశ్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం అందజేయాలని, కబడ్డీలో పాల్గొనే బాలుర బరువు 57 కిలోల లోపు, బాలికలు 54 కిలోల లోపు ఉండాలని పేర్కొన్నారు.

'ఎన్నికల్లో విజయం సాధించాలి'

జగిత్యాల: విద్యుత్ సంస్థల్లో సెప్టెంబర్ 8న జరిగే ఎన్నికల్లో విజయం సాధించాలని తెలంగాణ రాష్ట్రవిద్యుత్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాశ్ అన్నారు. ఎన్నికలను పురస్కరించుకుని పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్మికుడు విజయంకోసం కృషి చేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు రాజలింగం, మునీందర్ పాల్గొన్నారు.

నట్టింట్లో మట్టుబెట్టారు!



సంఘటన స్థలంలో శ్రీనివాస్ మృతదేహం



శ్రీనివాస్(ఫైల్)

• 'ఖని'లో రౌడీషీటర్ దారుణహత్య • కత్తులతో నరికి చంపిన ప్రత్యర్థి • ప్రాణం తీసిన సెటిల్‌మెంట్ • ఉలిక్కిపడిన కోల్‌బెల్ట్

గోదావరిఖని(రామగుండం): తన గూండాయిజంతో కోల్‌బెల్ట్ ప్రాంతాన్ని 15 ఏళ్లపాటు గడగడలాడించిన ఓ రౌడీషీటర్‌ను ప్రత్యర్థి అత్యంత దారుణంగా హత్యచేశాడు. తనకు సంబంధం లేని విషయంలో తలదూర్చిన రౌడీషీటర్‌తో తన ప్రాణాలకు ముప్పే అని భావించిన ప్రత్యర్థి పక్కా ప్లాన్‌తో అతడి నట్టింట్లోనే మట్టుపెట్టాడు. ఆదివారం ఉదయం జరిగిన ఈ సంఘటన గోదావరిఖనిలో సంచలనం రేపింది. స్థానికులు, హతుడి సన్నిహితులు తెలిపిన వివరాల ప్రకారం..

గోదావరిఖనిచెందిన ఆరుకోళ్ల శ్రీనివాస్ ఉరఫ్ బుగ్గల శ్రీను(39) గతంలో విద్యానగర్‌లో నివాసముండేవాడు. రెండేళ్ల క్రితం ఉదయ్‌నగర్‌లోని టీ2–265 క్వార్టర్‌లోకి తన నివాసాన్ని మార్చాడు. రియల్ ఎస్టేట్, అక్రమ భూదందా, సెటిల్‌మెంట్లు నిర్వహిస్తుండడంతోపాటు ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. నిత్యం ఉదయం ఇంటివద్దే వాకింగ్ చేసే శ్రీనివాస్ ఎప్పుడు బయటకు వచ్చినా అతడి వెంట నలుగురు అనుచరులుండేవారు. ఇంట్లో ఉన్నప్పుడు అనుచరులు ఎవరూ ఉండరనే విషయాన్ని పసిగట్టిన ప్రత్యర్థి, ప్రశాంత్‌నగర్‌కు చెందిన పెద్ది రవిశంకర్, శ్రీనివాస్‌ను మట్టుపెట్టేందుకు పక్కా ప్లాన్ రూపొందించాడు. ఇందుకోసం రెక్కీ కూడా నిర్వహించినట్లు సమాచారం. ఆదివారం ఉదయం తన పథకాన్ని అమలు చేశాడు.



హత్య జరిగిన తీరును సీపీ విక్రమ్‌జిత్ దుగ్గల్‌కు వివరిస్తున్న శ్రీనివాస్ భార్య అంజలి

తన ప్రాణాలకే ముప్పని..

చంద్రయ్యకు చెల్లించాల్సిన డబ్బుల విషయంలో ఏ సంబంధం లేని రౌడీషీటర్ శ్రీనివాస్ జోక్యం చేసుకోవడం, తనను పిలిచి వార్నింగ్ ఇవ్వడంతో తన ప్రాణాలకు ముప్పు ఉందని రవిశంకర్ భావించాడు. ఈ విషయాన్ని అతడి మిత్రులు ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన నాగరాజు, జీఎం కాలనీకి చెందిన నరేశ్, పీకే రామయ్యకాలనీకి చెందిన రవి, మరో ఇద్దరికి తెలిపాడు. ప్రాణ భయంతో తానే శ్రీనివాస్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు పక్కా పథకం రూపొందించి మిత్రుల సహకారం కోరాడు. అందరూ కలిసి ఆదివారం ఉదయం దానిని అమలు చేశారు. సంఘటనా స్థలాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్, పెద్దపల్లి డీసీపీ విజేందర్‌రెడ్డి, గోదా వరిఖని ఏసీపీ అపూర్వ రావు, సీఐలు జి.కృష్ణ, వాసుదేవరావు సందర్శించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. కరీంనగర్ నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ రప్పించి ఆధారాలు సేకరించారు. నిందితుల కోసం పది బృందాలను రంగంలోకి దించి గాలింపు చేపట్టారు.

ఇదీ శ్రీనివాస్ నేరచరిత్ర..

2004లో హనుమాన్‌నగర్‌కు చెందిన ఓ యువకుడి హత్య, 2005లో తిలక్‌నగర్‌కు చెందిన మరొకరిని ఎల్కలపల్లి గ్రామ శివారులోని ఎన్టీపీసీ రిజర్వాయర్ సమీపంలో హత్యకు, 2008లో జీఎం కాలనీలో పుట్ట శారద, 2009లో అంతర్గాం సర్పంచ్ చింతల ప్రశాంత్ హత్యకు పథకం రచించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. పుట్ట శారద, చింతల ప్రశాంత్ కేసులలో ఆరుకోళ్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయగా...ఆ తర్వాత కోర్టులో కొట్టివేశారు. 2010, ఫిబ్రవరి 9న రాత్రి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎర్రగోళ్ల రమేశ్‌ను షార్ట్‌వెపన్‌తో హత్య చేయడంతో శ్రీనివాస్‌పై హత్యకేసు నమోదైంది. 2010, జులై 30న శ్రీనివాస్‌పై వన్‌టౌన్ పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. ప్రస్తుతం కానిస్టేబల్ రమేశ్ హత్య కేసు సీబీసీఐడీ పర్యవేక్షిస్తుండగా...అది ట్రయల్‌కు వచ్చింది.

సాధారణ వ్యక్తిగా వచ్చి..

ఉదయం 8:40 గంటలకు సాధారణ వ్యక్తిగానే రవిశంకర్ తన మిత్రులతో కలిసి ఆటోలో శ్రీనివాస్ ఇంటికి వచ్చాడు. గేటు తీసుకుని ఒక్కడే లోపలికి వెళ్లాడు. ఎదురుగా శ్రీనివాస్ కనిపించాడు. తనకు గతంలో పరిచయం ఉన్న వ్యక్తే కావడంతో 'రా.. తమ్మి' అని ఆహ్వానించాడు. శ్రీనివాస్ పక్కనే కూర్చున్న అతడి భార్య అంజలి లేచి బయటకు వచ్చింది. దీంతో రవిశంకర్ ఆటోలో ఉన్న మిత్రులకు సైగ చేశాడు. రెప్పపాటులో వారు ఇంట్లోకి వెళ్లి రవిశంకర్‌కు కత్తి ఇచ్చారు. దానిని తీసుకుని రవిశంకర్ లోపలికి వెళ్లడాన్ని గమనించిన అంజలి పరుగున వచ్చి రవిశంకర్‌ను అడ్డుకోబోయింది. అతడు తన కత్తితో ఆమెను బెదిరించి నెట్టేశాడు. దీంతో ఆమె కిందపడిపోయింది. ఇంతలో రవిశంకర్ మిత్రులు కూడా కత్తులతో లోపలికి వెళ్లారు.

కసితీరా పొడిచారు..

ఏం జరుగుతుందో అర్థం చేసుకునేలోపే అందరూ శ్రీనివాస్ ఉన్న గదిలోకి వెళ్లి అతడి తల, చేతులు, పొట్ట భాగంలో కసితీరా పొడిచారు. తల భాగంలో వేటు వేయడంతో మెదడు బయటకు వచ్చి దూరంగా పడింది. నిమిషాల్లోనే శ్రీనివాస్ ప్రాణాలు వదిలాడు. వచ్చిన పని అయిపోవడంతో అందరూ వచ్చిన ఆటోలోనే వెళ్లిపోయారు. హత్య విషయం దావానంల వ్యాపించడంతో పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, శ్రీనివాస్ బాధితులు తండోపతండాలుగా ఉదయ్‌నగర్‌కు చేరుకున్నారు. శ్రీనివాస్‌కు కూతురు, కుమారుడు ఉన్నారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆ బెదిరింపు తెచ్చిన ముప్పు

గోదావరిఖని రాంనగర్‌కు చెందిన చంద్రయ్య ఉరఫ్ ఎల్లయ్య సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. వచ్చిన డబ్బులతో భూమి కొనుగోలు చేసేందుకు తనకు తెలిసిన, ప్రశాంత్‌నగర్‌కు చెందిన పెద్ది రవిశంకర్‌ను సంప్రదించాడు. అతడి సహాయంతో రూ.15 లక్షలు వెచ్చించి మంచిర్యాల జిల్లా కేంద్రంలో 20 గుంటల భూమి కొనుగోలు చేశాడు. అయితే ఆ స్థలంపై వివాదం ఉండడంతో చంద్రయ్య తన భూమి అవసరం లేదని, తన డబ్బులు తనకు చెల్లించాలని రవిశంకర్‌పై ఒత్తిడి చేశాడు. తన వద్ద డబ్బులు లేవని తెలపడంతో ఈ విషయమై మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కూడా అయింది. చివరకు రవిశంకర్ డబ్బులు చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చాడు. అయితే తర్వాత వాటిని చెల్లించలేకపోయాడు. దీంతో చంద్రయ్య గోదావరిఖని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా పోలీసులు కోర్టులో తేల్చుకోవాలని సూచించారు. అయితే చంద్రయ్య కోర్టుకు వెళ్లకుండా రౌడీషీటర్ ఆరుకోళ్ల శ్రీనివాస్‌ను సంప్రదించాడు. మొత్తం వివరాలు తెలుసుకున్న శ్రీనివాస్.. రెండు నెలల క్రితం పెద్ది రవిశంకర్‌ను ఎన్టీపీసీకి పిలిపించి చంద్రయ్యకు డబ్బులు చెల్లించాలని హెచ్చరించాడు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడు.

పెద్ది రవిశంకర్‌పై కేసు..

ఆరుకోళ్ల శ్రీనివాస్‌ను దారుణంగా హత్యచేశాడని పేర్కొంటూ అతడి భార్య అంజలి ప్రశాంత్‌నగర్‌కు చెందిన పెద్ది రవిశంకర్‌పై గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రవిశంకర్‌పై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రవిశంకర్‌పై కూడా గతంలో ఓ మర్డర్ కేసు నమోదైనట్లు తెలిసింది.


తమ్ముడిని తీసుకొస్తూ.. మృత్యు ఒడికి

- సిద్దిపేట జిల్లా కొండపాకవద్ద లారీని ఢీకొన్న కారు
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు జిల్లావాసులు దుర్మరణం
- మరో ఇద్దరికి గాయాలు

గన్నేరువరం(మానకొండూర్): దుబాయ్ నుంచి వస్తున్న తమ్ముడిని తీసుకురావడానికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లిన అన్నను తిరుగు ప్రయాణంలో మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఈ సంఘటనలో అతడి మిత్రుడు కూడా దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిద్దిపేట జిల్లా కొండపాక వద్ద అదివారం వేకువజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం గన్నేరువరం, చొక్కారావుపల్లెలో విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గన్నేరువరం గ్రామానికి చెందిన బత్తిని సమ్మయ్య–సత్తవ్వ దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు శేఖర్ ఉపాధి నిమిత్తం కొన్ని నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ పని లేకపోవడంతో ఇంటి రావడానికి సిద్ధమయ్యాడు. అయితే విమానం టిక్కెట్‌కు కూడా అతడి వద్ద డబ్బులు లేకపోవడంతో కుటుంబ సభ్యులే పంపించారు. డబ్బులు అందడంతో శేఖర్ శనివారం స్వగ్రామానికి బయల్దేరాడు. ఈమేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. రాత్రి హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. శేఖర్‌ను గ్రామానికి తీసుకు రావడానికి అన్న బత్తిని రాజమల్లు(27), గ్రామ శివారులోని చాకలివానిపల్లెకు చెందిన స్నేహితుడు కూన సంతోష్ కారులో హైదరాబాద్‌కు పయనమయ్యాడు. చొక్కారావుపల్లెకు చెందిన మహంకాళి మల్లయ్య–మల్లవ్వ కుమారుడు అనిల్(26)ను కూడా వెంట తీసుకెళ్లారు. అర్ధరాత్రి ఎయిర్‌పోర్ట్‌లో శేఖర్‌ను రిసీవ్ చేసుకుని స్వగ్రామానికి బయల్దేరారు. వారు ప్రయాణిస్తున్న కారు సిద్దిపేట జిల్లా కొండపాక శివారుకు రాగానే రోడ్డు పక్కన ఆగి ఉన్న ఇనుప చువ్వల లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇనుప చువ్వలు బత్తిని రాజమల్లు, మహంకాళి అనిల్ శరీరంలోకి దూసుకుపోవడంతో ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. వెనుక సీటులో కూర్చున్న శేఖర్, సంతోష్ గాయపడ్డారు. స్థానికులు గంటసేపు శ్రమించి అతి కష్టంమీద కారులో చిక్కుకుపోయిన క్షతగాత్రులను బయటకు తీసి సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు హుటాహుటిన సిద్దిపేట ఆస్పత్రికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ సంతోష్ పరిస్థితి విషయంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. శేఖర్‌ను కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.



బత్తిని రాజమల్లు(ఫైల్), మహంకాళి అనిల్(ఫైల్)



క్షతగాత్రులు కూన సంతోష్, బత్తిని శేఖర్

ఏడాది క్రితమే వివాహం..

మృతుల్లో బత్తిని రాజమల్లుకు ఏడాది క్రితమే సరితతో వివాహం జరిగింది. రెండు కుటుంబాల బాధ్యతను రాజమల్లే చూసేవాడు. తమ్ముడి కోసం మృతిచెందడంతో భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మహంకాళి అనిల్ అవివాహితుడు. రోడ్డు ప్రమాదంలో ఒకే రోజు ఇద్దరు యువకులు మృతి చెందడంతో గన్నేరువరం, చొక్కారావుపల్లెలో గ్రామాల్లో విషాదం నెలకొంది. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులు అప్పగించగా, వారు స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో పశ్చిమ తీరం, తెలంగాణలో అక్కడక్కడ, దక్షిణ చత్తీస్‌గఢ్‌లలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవచ్చు. తూర్పు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు, ఒడిశా, మధ్య, ఈశాన్య భారతంలో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

గుంటూరుకరీంనగర్ వాతావరణం

గరిష్ఠం కనిష్ఠం

30.84/22505°

జాతీయం

నగరం	గరిష్ఠ	కనిష్ఠ
ఢిల్లీ	35.7	24.8
కోల్‌కతా	32.9	26.7
బెంగళూరు	26.5	21.0
ముంబై	29.8	25.2
చెన్నై	32.9	25.8

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ఠ/కనిష్ఠ	పట్టణం/జిల్లా	గరిష్ఠ/కనిష్ఠ
కాకినాడ	33.1/26.7	విజయవాడ	30.9/26.0
అనంతపురం	33.1/24.1	శ్రీకాకుళం	30.8/26.6
చిత్తూరు	33.0/26.2	విజయనగరం	30.8/26.6
తిరుపతి	33.0/26.2	కరీంనగర్	30.8/25.5
విశాఖపట్నం	31.8/27.6	గుంటూరు	30.4/25.0
నెల్లూరు	31.8/26.1	నిజామాబాద్	30.4/23.7
ఆదిలాబాద్	31.8/25.6	వరంగల్	30.3/25.0
నల్లగొండ	31.2/25.0	మహబూబ్‌నగర్	30.3/23.0
ఒంగోలు	31.1/26.6	హైదరాబాద్	30.2/23.0
కడప	31.1/25.0	రంగారెడ్డి	30.2/23.0
ఏలూరు	31.0/26.8	కర్నూలు	30.1/23.1
రాజమండ్రి	31.0/26.8	ఖమ్మం	29.8/21.6
తాడేపల్లిగూడెం	31.0/26.8	మెదక్	29.1/21.2


బుల్లితెర www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.07.30 నంద్యాల జడ్జిమెంట్
ఉ.09.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.09.30 నంద్యాల జడ్జిమెంట్
ఉ.10.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.10.30 నంద్యాల జడ్జిమెంట్
మ.12.00 నంద్యాల జడ్జిమెంట్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 పండగ వేళ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 ప్రేమకు స్వాగతం
ఉ.09.30 శివశంకర్
మ.12.00 కార్తికేయ
సా.06.00 లడ్డూబాబు
రా.09.00 పంజా



మూవీస్ నౌ
ఉ.10.00 ఏలియన్స్ ఇన్ ద ఎటిక్
ఉ.11.50 రష్ అవర్ 3
సా.04.45 డాన్ ఆఫ్ ద డెడ్
సా.06.45 థోర్
రా.09.00 ద కంజ్యూరింగ్



హెచ్‌బీవో
ఉ.06.00 జోనా హెక్స్
ఉ.10.52 ద డార్క్ నైట్
మ.01.23 ఐపీ మ్యాన్ 3
సా.05.00 ద అకౌంటెంట్
రా.10.49 ద హ్యాంగోవర్-2



స్టార్ మూవీస్
ఉ.06.56 టర్బో
ఉ.08.47 ఇండిపెండెన్స్ డే
మ.01.22 చైనీస్ జోడియాక్
మ.03.46 ద అవెంజర్స్
సా.06.42 గూస్‌బమ్స్



మా మూవీస్
ఉ.07.00 ఆడవాళ్లే అలిగితే
ఉ.09.00 సోగ్గాడు
మ.12.00 షాపింగ్ మాల్
సా.05.00 నమో వెంకటేశ
రా.09.00 దేవరకొండ వీరయ్య



జీ క్లాసిక్
ఉ.06.17 కాళీచరణ్
ఉ.09.21 జిగ్రీ దోస్త్
మ.12.36 హైసీయత్
రా.07.00 కుందన్
రా.09.00 శేష్‌నాగ్

తిరుమల సమాచారం

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 27 కంపార్టుమెంట్లు నిండాయి.

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ	–	ఖాళీ లేవు
వసంతోత్సవం	–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	ఖాళీ లేవు

సోమవారం ప్రత్యేక సేవ : విశేష పూజ



వేములవాడ ఆలయ సమాచారం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 7 గంటలకు అందిన సమాచారం మేరకు...

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	03	1,000
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	15	750
నందీశ్వర సాధారణ	04	350
రాజేశ్వరపురం ఏసీ	02	750
రాజేశ్వరపురం సాధారాణ	08	350
లక్ష్మీగణపతి	29	250
పార్వతీపురం స్పెషల్	35	500
పార్వతీపురంసాధారణ	38	200
శివపురం	33	150
శంకరపురం	48	50

లడ్డూప్రసాదం, పులిహోర, లడ్డూ భోగం అందుబాటులో ఉన్నాయి. – వేములవాడ



చికెన్ ధరలు

లైవ్ కోడి	:	80	బోన్‌లెస్	:	350
చికెన్	:	120	మటన్ కిలో	:	500
స్కిన్‌లెస్	:	160			- కరీంనగర్



Padi-Panta

మొక్కల రక్షణకు
దడులు పెట్టండి

జిల్లాలో దడుల ఏర్పాటుకు ఉపాధిహామీ

సారంగాపూర్: మొక్కల చుట్టూ కంచె నాటి చుట్టూ దడి (కట్టెలు, ముళ్లతో ఏర్పాటు చేసే కంచె) ఏర్పాటుచేస్తే ఉపాధిహామీశాఖ డబ్బులు చెల్లిస్తుంది. హరితహారం ప్రారంభించి మూడేళ్లైంది. మూడో విడత హరితహారం కార్యక్రమం గ్రామాల్లో, పట్టణాల్లో జోరుగా సాగుతోంది. మొదటి, రెండోవిడతల హరితహారం కార్యక్రమానికి భిన్నంగా అధికారులు మొక్కలను బతికించడానికి మరికొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. మొక్కచుట్టూ కట్టెలు, ముళ్లతో ఏర్పాటుచేసే కంచె (ట్రీగార్డ్)కు ఉపాధిహామీ శాఖ ద్వారా కూలీకి ఇప్పటి వరకు రూ.138 అందిస్తున్నారు.

దడి పెడితే డబ్బులే..

అటవీశాఖ భూముల్లో, రెవెన్యూ భూముల్లో, ఇతర ప్రభుత్వ భూముల్లో ఎకరాల కొద్ది మొక్కలు నాటితే వాటిని పశువులు తినేస్తున్నాయని భావించిన అధికారులు కట్టెలు, ముళ్లతో దడులు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కొన్నిచోట్ల అటవీశాఖ 15 నుంచి 20 ఎకరాల ప్లాంటేషన్‌లను ఏర్పాటుచేసింది. రెవెన్యూ భూములు 3 నుంచి 5 ఎకరాల వరకు ఖాళీగా ఉన్న వాటిలో మొక్కలను నాటుతున్నారు. ఈ భూముల్లో రెండు హరితహారాల్లో నాటిన మొక్కలు పశువులు, మేకలు, గొర్రెలు, అడవి జంతువులు తిరగడంతో నూటికి పది మొక్కలు కూడ దక్కలేదు. ప్రస్తుతం తిరిగి అదే భూముల్లో మూడో విడత హరితహారంలో మొక్కలు నాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్న ఆలోచనతో ఎంత పెద్ద విస్తీర్ణంలో మొక్కలు నాటిన, హరితవనం చుట్టూ దడులు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇందుకు దడిని ఏర్పాటుచేసే ఉపాధిహామీ కూలికి ఒక రన్నింగ్ మీటరుకు రూ. 24.40 పైసలు చెల్లిస్తున్నారు. రెండు మీటర్లకు ఒక బలమైన కర్రనాటి, మధ్యలో వెదురు లేదా, ఇతర కలపతో అడ్డంగా కర్రలను ఏర్పాటుచేయాలి. ఈ లెక్కన ఎకరంలో నాటిన మొక్కల ప్లాంటేషన్ చుట్టూ దడి ఏర్పాటుకు రూ.3,500 వరకు ఖర్చుచేస్తారు.

జిల్లాలో దడుల ఏర్పాటుకు రూ.4 కోట్లు ఖర్చు



రెవెన్యూ భూములు, అటవీ భూములు, ప్రభుత్వభూముల్లో నాటిన మొక్కల చుట్టూ ఉపాధిహామీ కూలీల ద్వారా దడులు ఏర్పాటుచేస్తున్నాం. జిల్లాలో దడుల ఏర్పాటుకు రూ.4 కోట్లు ఖర్చుచేస్తున్నాం, ప్రతి మొక్క దక్కించాలన్నదే దీని ఉద్దేశ్యం.

– లక్ష్మినారాయణ,అడిషనల్ పీడీ



సారంగాపూర్‌లో ఏర్పాటుచేసిన దడి



చికెన్ (సుగుణ)

స్కిన్	స్కిన్‌లెస్
120	140

భవిష్యం

మేషం: పనులు సకాలంలో పూర్తి. సంఘంలో ఆదరణ. దూరప్రాంతాల నుంచి కీలక సమాచారం. భూలాభాలు. వృత్తి, వ్యాపారాలలో ఒత్తిడులు తొలగుతాయి.

వృషభం: చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. సేవలకు గుర్తింపు రాగలదు. ఆకస్మిక ధన, వస్తులాభాలు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు హోదాలు.



మిథునం: మిత్రులతో మాటపట్టింపులు. ధనవ్యయం. పనులు ముందుకు సాగవు. ప్రయాణాలు వాయిదా. వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి. ఉద్యోగులకు వివాదాలు.

కర్కాటకం: రుణయత్నాలు. ప్రయాణాలలో అవాంతరాలు. బంధువులతో విభేదాలు. అనుకోని ఖర్చులు. ఆరోగ్యభంగం. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

సింహం: పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆసక్తికర సమాచారం. ఇంటాబయటా అనుకూలం. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహం.

కన్య: కుటుంబసభ్యులతో స్వల్ప వివాదాలు. ఆర్థిక లావాదేవీలు మందగిస్తాయి. శ్రమాధిక్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నిరాశాజనకంగా ఉంటుంది.

తుల: పలుకుబడి పెరుగుతుంది. ఆస్తిలాభ సూచనలు. ప్రముఖులతో పరిచయాలు. బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలలో కొత్త పెట్టుబడులు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు.

వృశ్చికం: కొన్ని పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొన్ని మార్పులు.

ధనుస్సు: పలుకుబడి పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల నుంచి శుభవార్తలు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు సంతోషకర సమాచారం.

మకరం: నూతన ఉద్యోగప్రాప్తి. చిన్ననాటి మిత్రుల కలయిక. కీలక నిర్ణయాలు. వ్యవహారాలలో విజయం. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూలత.

కుంభం: పనుల్లో ప్రతిబంధకాలు. రాబడికి మించిన ఖర్చులు. అనారోగ్యం. కుటుంబ సభ్యులతో విభేదాలు. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు పనిఒత్తిడులు.

మీనం: కుటుంబసభ్యులతో వైరం. శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశాజనకంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు

హలో సాక్షి..

జగిత్యాల : 97053 46639
జగిత్యాల రూరల్ : 96034 62574
జగిత్యాలజోన్ /అగ్రికల్చర్ : 97053 46640
జగిత్యాలటౌన్ : 96767 63659
సారంగాపూర్ : 94901 83613
రాయికల్ : 94400 78781
మేడిపల్లి : 97053 46649
బీర్‌పూర్ : 81795 58285

అధ్వానంగా రోడ్డు



బీర్‌పూర్ మండలం నుంచి నర్సింహులపల్లికి వెళ్లే రోడ్డు గత ఐదేళ్ల నుంచి అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

-సురేశ్, బీర్‌పూర్

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

రోడ్లు ధ్వంసం

గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రుపాయల వ్యయంతో నిర్మిస్తున్న తారు రోడ్లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. ఎన్ని నిబంధనలు పెట్టినా, కేసులు బనాయించినా, జరిమానాలు విధించినా కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడుపుతూ రోడ్లను ధ్వంసం చేస్తునే ఉన్నారు. అధికారుల పర్యవేక్షణ ఒక కారణమైతే, రైతులకు, ట్రాక్టర్ యాజమాన్యాలకు అవగాహన లోపం కారణమవుతోంది. దీంతో రోడ్ల మరమ్మతులు చేసేందుకు తలకు మించిన భారంగా మారుతోంది.



కేజీ వీల్స్‌తో చెడిపోయిన రంగాపూర్-కాచారం రోడ్డు

మేడిపెల్లి: గ్రామీణ పాంత్రాల్లో ప్రజల సౌకర్యం కోసం కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న రోడ్లు కాంట్రాక్టర్ల కక్కుర్తితో పాటు అధికారుల పర్యవేక్షణ లోపంతో వేసిన రెండు మూడు నెలలకే చెడిపోతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. దీనికి తాజా ఉదాహరణే రంగాపూర్ నుంచి కాచారం వెళ్లే రోడ్డు దుస్థితి. మండలంలోని కాచారం నుంచి రంగాపూర్‌కు సీఆర్ఆర్ గ్రాంటు కింద రూ.2కోట్ల 6లక్షలతో మూడు కిలోమీటర్ల వరకు రోడ్డును వేశారు. మూడు నెలల క్రితమే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కాని అధికారుల పర్యవేక్షణ లోపంతో రోడ్లపై కేజీ వీల్స్ ట్రాక్టర్లు నడవడంతో కోట్లాది రూపాయలతో వేసిన రోడ్లు గీతలు పడి తారు లేచి పోతుంది. దీంతో రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయి. వేసిన మూడు నెలలకే పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్‌లో ఈ రోడ్డు పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో అధికారులు పూర్తిగా విఫలం కావడంతో పరిస్థితి ఇలా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై కేజీ వీల్స్ ట్రాక్టర్లు నడవకుండా చేసి రోడ్లను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పగుళ్లు చూపిన రోడ్డు

భీమారం నుంచి కాచారం వరకు వేసిన రోడ్డు కూడా రెండు నెలలకే పగుళ్లు చూపింది. కల్వర్టుల వద్ద పోసిన మట్టిని సరిగ్గా రోలింగ్ చేయకపోవడంతో వాటిపై పోసిన తారు బీటలు వారింది. కాని వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం రోడ్డు నాణ్యతపై పట్టించుకోకపోవడంతోనే ఇలా జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇలాంటివి జరుగకుండా చూడాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

'సెప్టెంబర్ 1 బ్లాక్ డే'

మేడిపెల్లి: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న తలపెట్టిన సామూహిక సెలవును విజయవంతం చేయాలని, ఆ రోజును ఉద్యోగులు బ్లాక్‌డేగా జరుపుకోవాలని తెలంగాణ ఐక్య ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తెం వెంకటేశ్ కోరారు. కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు.

మండలస్థాయి క్రీడలను విజయవంతం చేయాలి

సారంగాపూర్: ఈ నెల 29 నుంచి జరిగే మండల స్థాయి క్రీడలను విజయవంతం చేయాలని ఎంఈవో కాంతయ్య పేర్కొన్నారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలు కోనాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 29న అండర్-17 బాలికలకు కబడ్డీ వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 30న అండర్-17 బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను, 31న బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట రేచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ భాస్కర్ ఉన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా స్థాయి సమావేశం

జగిత్యాల: స్థానిక టీపీటీఎఫ్ భవనంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 9న జరిగే జిల్లా స్థాయి ప్రైవేటు ఉపాధ్యాయుల ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, గంగాధర్ పాల్గొన్నారు.

వోపా ప్రతిభా పురస్కారాలు ప్రదానం

జగిత్యాల: విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నలంద డిగ్రీ కళాశాలలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటేశ్వరచారి, ద్రోణచారి, విష్ణువర్ధన్‌చారి పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

జగిత్యాల: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సత్యసాయి నిత్యాన్నదాన పథకాన్ని సత్యసాయి సేవా సమితి సభ్యులు ఏర్పాటు చేశారు. మొదటి వార్షికోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు ఉచిత భోజన సేవా ట్రస్ట్ ద్వారా అందించడం అభినందనీయమన్నారు. ఎస్పీ అనంత శర్మ మాట్లాడుతూ ప్రతీరోజు ఉచితంగా భోజనం అందజేయడం గొప్ప విషయమని సంవత్సరం పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం సేవా సమితి సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చెర్‌పర్సన్ విజయలక్ష్మి, టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్, కౌన్సిలర్లు రాజేందర్, అనిత పాల్గొన్నారు.

వరకట్న ఫిర్యాదుల విచారణ కమిటీ నియామకం

కరీంనగర్‌లీగల్: పోలీస్‌స్టేషన్లతోపాటు కోర్టుకు వచ్చే వరకట్నపు వేధింపులు, 498 ఏ ఫిర్యాదుల ప్రాథమిక విచారణకు సుప్రీం కోర్టు ఆదేశాలతో ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి ఏ.వీ.పార్థసారధి నియమించారు. ఈ కమిటీలో హుజురాబాద్‌కు చెందిన పారాలీగల్ వలంటీర్ ఎ.శోభారాణి, కరీంనగర్‌కు చెందిన రిటైర్డ్ జిల్లా రెవెన్యూ అధికారి ఆరెపల్లి కొమురయ్య, జిల్లా కోర్టు న్యాయవాది కూకట్ల కొమురయ్యను నియమిస్తూ పార్థసారధి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వాప్తంగా ఈ కమిటీని నియమించారు. పోలీస్‌స్టేషన్‌కు, కోర్టుకు వచ్చే 498–ఏ ఫిర్యాదులను జిల్లా న్యాయసేవా సంస్థ పర్యావేక్షణలో ఈ ఫ్యామిలి వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదుల్ని పంపిస్తారు. కమిటీ సభ్యులు విచారణ చేసి నెలరోజుల్లో తిరిగి అధికార సంస్థకు పంపిస్తారు. ప్రాథమిక విచారణ రిపోర్టు ఆధారంగా పోలీసులు, కోర్టులు తదుపరి చర్యలు చేపట్టనున్నాయి.

తెలంగాణ భాష ప్రత్యేకమైనది

ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కల్చరల్: మన భాష తెలంగాణకు ప్రత్యేకమైనదని ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ జాగృతి రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతి కవితాంజలి కవి సమ్మేళనంలో భాగంగా ఆదివారం కరీంనగర్ జిల్లా పరిషత్ హాల్‌లో తెలంగాణం అంశంపై కవిసమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ భాషలో గొప్ప సాహిత్యం ఉందని, మన భాషతోనే ఉద్యమం ఊపందుకుని రాష్ట్రం సాధించే వరకు వెళ్లిందన్నారు. మన భాష, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ.. ప్రపంచానికి చాటేందుకే జాగృతి ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కవి సమ్మేళనాలు నిర్వహించడం దేశంలోనే ప్రప్రథమం అన్నారు. రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ.. కరీంనగర్ రాష్ట్రానికి భౌతిక రాజధాని అని, ఏదైనా కరీంనగర్ నుంచే ప్రారంభం కావాలన్నారు. అన్నింట్లో ముందుండే వారు కూడా కరీంనగర్ వారేన్నారు. కొత్త, పాత కవులతో కవుల సంగమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, సాహిత్య విభాగం రాష్ట్ర కన్వీనర్ కాంచన్‌పల్లి, రాష్ట్ర కార్యదర్శులు బాలసంకుల అనంతరావు, నంది శ్రీనివాస్, రాష్ట్ర కో కన్వీనర్ గందె కల్పన, వంగల శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ జాడి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి గన్నమనేని రంగారావు, జిల్లా కో శాధికారి ఎ.రాజారాం, జిల్లా కో కన్వీనర్లు మంజాల శ్రీనివాస్, జిల్లా బాధ్యులు గర్రెపల్లి ర మాదేవి, పుల్లూరి రవీందర్, ఛత్రపతి శ్రీనివా స్, అంకం శివారాణి, ఉయ్యాల విష్ణు, రజి, ర వీందర్‌రెడ్డిలతో పాటు వివిధ సాహితీ సంస్థల బాధ్యులు గంద్ర లక్ష్మన్‌రావు, దాస్యం సేనాధిపతి, గాజుల రవీందర్, కెఎస్.అనంతాచార్య, కలువకుంట రామకృష్ణ, గుర్రాల మాధవ్, కొ త్త అనిల్‌కుమార్, మాడిశెట్టి గోపాల్, అన్నవ రం దేవేందర్, నాగేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణకు చెందిన ప్రముఖ క వులు నన్నయ్య, పోతన, సురవరం ప్రతాప్ రెడ్డి, కాళోజి నారాయణరావు, మెల్ల, తెలంగాణ తల్లి వేషధారణలతో చిన్నారులు అందరిని ఆకట్టుకున్నారు. చీఫ్‌విప్ వారికి జ్ఞాపికలు అందించి అభినందించారు.



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: గ్రామస్థాయినుంచి బీజేపీని పటిష్టం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంబీ గార్డెన్‌లో ఆదివారం ఏఐటీయూసీ నా యకుడు ముత్యం రామయ్యతో పాటు పలువురు యువకులకు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుజ్జుల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అన్ని రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో ఇప్పటికే రెండుసార్లు పర్యటించి బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేలా సూచనలిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మోడీ అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులై యువకులు పార్టీలో చేరుతున్నారన్నారు. అంతకు ముందు పట్టణంలోని పురవీధుల్లో బాణసంచా కాలుస్తు ర్యాలీ తీశారు. పెద్దపల్లి మండలాధ్యక్షుడు పల్లె సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కాసర్ల జనార్ధన్‌రెడ్డి, సిలువేరు ఓదెలు, పిన్నింటిరాజు, పర్శ సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాసరావు, అక్కెపల్లి క్రాంతి, మిట్టపల్లి తిరుపతి, తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

రైతులను మభ్యపెడుతున్న సీఎం

- రూ.4 వేల రాయితీ డ్రామాతో మోసం చేస్తున్న కేసీఆర్
- ఒకేసారి రుణామాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌ది
- మాజీ మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్ (మంథని): రైతులను మాయమాటలతో మభ్యపెట్టేం దుకు సీఎం కేసీఆర్ ఎకరానికి రూ. 4వేలు అందిస్తానని మరో కపటనాటకం ఆడేందుకు సిద్ధపడుతున్నాడని మాజీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని గుండారం గ్రామానికి చెందిన టీడీపీ, టీఆర్‌ఎస్‌లకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు రైతులపై ప్రేమాభిమానం ఉంటే ఎకరానికి రూ. 4 వేలను ఈ ఏడాది నుంచి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఏడాది తర్వాత ఎన్నికలను ముందు పెట్టుకొని రూ. 4వేలతో ఓటర్లను కొనడానికి సిద్ధపడుతున్నాడని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి, అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని మాయమాటలతో గద్దెనెక్కిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను నిలువునా దగా చేసిందన్నారు. కాంగ్రెస్ రైతులకు ఇచ్చినహామీ ప్రకారం అధికారంలోకి రాగానే రైతుల పంటరుణాలను ఒకేసారి మాఫీ చేశామన్నారు. టీఆర్‌ఎస్ నాలుగు విడతలుగా చేసిన మాఫీ వడ్డీలకే సరిపోయిందని, తీసుకున్న రుణాలు అలాగే ఉన్నాయని దీంతో రైతులు అరిగోస పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ. 3వేలు అందిస్తామని, నిబంధన లేకుండా పింఛన్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఇనగంటి జగదీశ్వర్‌రావు, గ్రామాధ్యక్షుడు ఆకుల ఓదెలు, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, సర్పంచ్ తోట చంద్రయ్య, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అక్బర్‌అలీ, పీఏసీఎస్ డైరెక్టర్ జంగిలి కనకయ్య, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నశ్రీధర్‌బాబు

ప్రపంచ రోలర్ ఫ్రీస్టైల్ పోటీలకు పెద్దపల్లి వాసి

- వచ్చేనెల 10న చైనాలో జరిగే పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం

పెద్దపల్లిరూరల్: ప్రపంచ స్థాయి రోలర్ ఫ్రీస్టైల్ పోటీలకు భారత్ తరపున ఆడే అవకాశాన్ని తెలంగా ణలోని పెద్దపల్లి జిల్లావాసి దక్కించుకుంది. హైదరాబాద్‌లోని భద్రుకా డిగ్రీ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ చదువుతున్న కోమల్ అట్టల్ రోలర్ ఫ్రీస్టైల్ పోటీల్లో తన ప్రతిభను చాటుకుంటోంది. గత నెలలో ఢిల్లీలోని నోయిడాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి నలుగురు పోటీ పడగా, దేశ వ్యాప్తంగా 27మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో ఎంపికైన కోమల్ అట్టల్ చైనాలోని నాంజింగ్‌లో జరిగే ప్రపంచ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించేందుకు ఆదివారం బయల్దేరి వెళ్లారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు కోమల్ అట్టల్ పేర్కొన్నారు. 2015లోనూ అర్జెంటీనా దేశంలోని రోసారియాలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు వివరించారు.


కోమల్ అట్టల్

మెట్‌పల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం

హుజూరాబాద్: హుజూరాబాద్‌లోని మెట్‌పల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఓనిరుపేద జంటకు ఆదర్శ వివాహం జరిపించారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ఎండపల్లికి చెందిన తోడేటి మహేశ్, తిరుపతమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. 15 ఏళ్ల క్రితం మహేశ్, తిరుపతమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ముగ్గురు ఆడపిల్లలను అమ్మమ్మ లస్మమ్మ చేరదీసి పోషించింది. కడు పేదరికంతో కొట్టుమిట్టాడుతుండగా.. రెండోఅమ్మాయి జయశ్రీని పెద్దపల్లి జిల్లా పాలితం గ్రామానికి చెందిన సందీప్‌కుమార్ పెళ్లి చేసుకునేందుకు ముందుకొచ్చాడు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వారిద్దరికి వివాహం జరిపించి ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీరాంరెడ్డి, సీఐ దాసరి భూమయ్య, నాయకులు కటంగూరి రాంచంద్రారెడ్డి, కంకణాల తిరుపతిరెడ్డి, పేరాల గోపాల్‌రావు, తోట రాజేంద్రప్రసాద్, కృష్ణారెడ్డి, పడాల రమేష్, తదితరులు ఉన్నారు.


పెళ్లి జంటను ఆశీర్వదిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రాజెక్టు ఏరియా

సింగూరు నుంచి నీటి కేటాయింపులు (టీఎంసీల్లో)

1,2 దశల ద్వారా హైదరాబాద్‌కు	2.96
3,4 దశల ద్వారా హైదరాబాద్‌కు	04
ఘణపూర్ ఆయకట్టుకు	4.06
నిజాంసాగర్ ప్రాజెక్టుకు	8.35
ప్రాజెక్టు సామర్థ్యం	29.91

'సింగూరు' సంక్షిప్తంగా..

- ఆయకట్టు : 40 వేల ఎకరాలు
- ప్రయోజనం పొందే మండలాలు : 4 (పుల్కల్, అందోలు, సదాశివపేట, మునిపల్లి)
- 44 గ్రామాలకు ప్రయోజనం
- కాల్వల పొడవు : 197 కి.మీ.
- ఎడమ కాలువ పొడవు : 24.15 కి.మీ
- ప్రధాన కాలువ పొడవు : 24.10 కి.మీ



పడావు నేలల్లో..

సింగూరు పరవళ్లు

40 ఏళ్ల తర్వాత.. 40 వేల ఎకరాలకు.. - కాళేశ్వరం ద్వారా మరో 35వేల ఎకరాలకు నీరు

సంగారెడ్డి నుంచి కల్వల మల్లికార్జున్‌రెడ్డి :

ఉమ్మడి మెదక్ జిల్లా మీదుగా 120 కిలో మీటర్ల పొడవునా ప్రవహిస్తున్న గోదావరి ఉపనది మంజీరాపై 1976లో 'సింగూరు ప్రాజెక్టు' నిర్మించారు. మంజీర పరీవాహక ప్రాంతంలో నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. నిజాం హయాంలో నిర్మితమైన ఘణపూర్, నిజాంసాగర్ పరిధిలోని ఆయకట్టును స్థిరీకరించడం కూడా ప్రాజెక్టు లక్ష్యాల్లో ఒకటి. ప్రాజెక్టు పూర్తయినా సాగునీటి కాలువలు తవ్వకుండా.. హైదరాబాద్ జంట నగరాల తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టు నీటిని వినియోగించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 1980 అక్టోబర్ 31న జీఓ 455ను విడుదల చేశారు. అయితే సాగునీరు ఇచ్చే దిశగా అప్పటి ప్రభుత్వాలు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు.

వైఎస్ చేతుల మీదుగా..!

సింగూరు నీళ్లను సాగునీటి అవసరాలకు విడుదల చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు ఆందోళనలు జరిగాయి. ఎన్నికల హామీలో భాగంగా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి 2006 జూన్ 7న రూ.88.99 కోట్ల అంచనాతో కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతోపాటుగా ఎత్తిపోతలకు రూ.32.68 కోట్లు కలుపుకుని మొత్తంగా 121.67 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. తొలి తెలంగాణ ప్రభుత్వంలో నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన టి.హరీశ్‌రావు చొరవతో కాలువల పనులు పూర్తి కాగా.. ప్రస్తుతం గేట్ల మరమ్మతు పనులు పూర్తి కావొచ్చాయి.

తొలిసారిగా పంట పొలాలకు...

ప్రాజెక్టు చరిత్రలో తొలిసారి గత ఏడాది యాసంగిలో కాలువలు, చెరువుల ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది కూడా నాలుగు మండలాల్లోని 44 గ్రామాల పరిధిలో 40వేల ఆయకట్టుకు నీరు అందించడం లక్ష్యంగా నీటిని విడుదల చేశారు. వరి, జొన్న, మొక్కజొన్న, కూరగాయల సాగుతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. ఉపాధి వేటలో హైదరాబాద్ వలస వెళ్లిన కుటుంబాలు తిరిగొస్తున్నాయి. సింగూరు జలాశయంలో గతేడాది 59.06లక్షల చేప పిల్లలను వదిలారు.




'సింగూరు' ప్రత్యేకత

గోదావరికి ఉపనది అయిన మంజీరా నదిపై పుల్కల్ మండలం సింగూరు వద్ద 29.91 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1976లో ఈ ప్రాజెక్టు నిర్మించారు. రూ.29.95 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పూర్తయ్యే నాటికి రూ.130 కోట్లకు చేరింది. ఎర్త్‌డ్యాం, స్పిల్‌వే, పవర్ హౌస్ నిర్మాణం పూర్తయిన తర్వాత.. 1999లో తొలిసారిగా ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. ఆ తర్వాత మంజీరాపై పుల్కుర్తి, సింగూరు వద్ద వంతెనలు నిర్మించారు. ఎర్త్‌డ్యాం మొత్తం పొడవు 7.11 కి.మీ.. గేట్లకు ఎడమవైపున 3.993 కిలోమీటర్లు, కుడివైపున 3.120 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 327 మీటర్ల పొడవున ఉన్న రాతి కట్టడంపై 17 గేట్లను ఏర్పాటు చేశారు.

ఐదేళ్లలో సింగూరు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో (మిలియన్ ఘనపుటడుగుల్లో)

సంవత్సరం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
2012-13	6,082	11,639
2013-14	27,516	8,798
2014-15	4,122	87,600
2015-16	2,061	5,854
2016-17	1,05,987	88,798



మూడో విడత హరితహారంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా నాటాల్సిన మొక్కలు 37.90 కోట్లు

22.17 కోట్లు

ఇప్పటివరకు హైదరాబాద్ సహ 30 జిల్లాల్లో నాటిన మొక్కలు..

"అన్ని జిల్లాల్లో కలిపి ఇంకా 42 శాతం మొక్కలు నాటాలి. వర్షాభావం వల్లే మొక్కలు నాటడంలో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

మూడో 'సారి'.. 58%

అత్యధిక జిల్లాల్లో జోరుతగ్గిన హరితహారం.. ఇప్పటికీ 'లక్ష్యం'లో సగమే పూర్తి

సూర్యాపేట నుంచి నాగరాజు కాకోళ్ల :

హరితహారం అనుకున్నంత వేగంగా సాగడం లేదు. మూడో విడత లక్ష్యంలో కేవలం 58 శాతం మాత్రమే పూర్తయింది. ఈ విడతలో అన్ని జిల్లాల్లో 37.90 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా హైదరాబాద్ సహా 30 జిల్లాల్లో ఇప్పటివరకు 22.17 కోట్ల మొక్కలనే నాటగలిగారు. ఖమ్మం జిల్లాలో లక్ష్యం మేర మొక్కలు నాటగా సంగారెడ్డి జిల్లా హరితహారంలో బాగా వెనుకబడి ఉంది.

రాష్ట్ర వ్యాప్తంగా 24 శాతం మేర ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచేందుకు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం.. మొత్తంగా 230 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. అటవీ ప్రాంతంలో 100 కోట్ల మొక్కలు, మరో 130 కోట్ల మొక్కలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నాటాలని నిర్ణయించారు. మొదటి విడతలో 15.86 కోట్లు, రెండో విడతలో 31.67 కోట్ల మొక్కలను నాటారు.

లక్ష్యంలో 50 శాతమే..

సూర్యాపేట, మహబూబాబాద్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, వనపర్తి, మహబూబ్ నగర్, మెదక్, వికారాబాద్, నిర్మల్, భూపాలపల్లి, గద్వాల, సంగారెడ్డి జిల్లాల్లో ఇచ్చిన లక్ష్యంలో 50 శాతంలోపు మొక్కలు మాత్రమే నాటారు.


ఇంకా 15 కోట్ల మొక్కలు

ఇంకా 42 శాతం మొక్కలు.. అంటే 15.73 కోట్ల మొక్కలు నాటాల్సి ఉంది. సెప్టెంబర్ వరకు వర్షాకాలం పూర్తవుతుంది. అప్పటిలోగా మిగతా 15.73 కోట్ల మొక్కలు నాటడంలో అధికార యంత్రాంగం సఫలం అవుతుందా లేదా అనేది వేచి చూడాలి.


"వర్షాభావం కారణంగా డిసెంబర్ మాసాంతం వరకు మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగించే అవకాశాలు ఉన్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

హరితహారంలో ఖమ్మం జిల్లా తర్వాత జనగామ, ఆదిలాబాద్, కొత్తగూడెం, మేడ్చల్, నిజామాబాద్, మంచిర్యాల, సిరిసిల్ల, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి.

హరితహారం కార్యక్రమం ముందుకు సాగకపోవడానికి తీవ్ర వర్షాభావ పరిస్థితులే కారణంగా తెలుస్తోంది. రెండో విడతలో నాటిన చాలా వరకు మొక్కలు పరిరక్షణ లేక ఎండిపోయిన విషయం తెలిసిందే."



మూడో విడతలో ఇప్పటివరకు నాటిన మొక్కల శాతం | మొత్తం 31 జిల్లాల్లో నాటాల్సిన మొక్కల శాతం



13 50 శాతం లోపు మొక్కలు నాటిన జిల్లాలు రాష్ట్రంలో 13 ఉన్నాయి.

17 రాష్ట్రంలో 17 జిల్లాల్లో 50 శాతానికిపైగా మొక్కలు నాటారు.

హరితహారంలో వెనుకబడిన కొన్ని జిల్లాలు..

జిల్లా	లక్ష్యం	నాటినవి (లక్షల్లో)
సిద్దిపేట	200.00	78.29
వనపర్తి	80.00	41.10
మహబూబ్‌నగర్	200.00	59.77
మెదక్	130.00	70.94
వికారాబాద్	125.00	45.82
నిర్మల్	100.00	33.12
భూపాలపల్లి	115.00	72.40
గద్వాల	80.00	53.47

కొత్త కొత్తగా..

ఇంజినీరింగ్ అదో సరికొత్త ప్రపంచం. పుష్కరకాల విద్యాభ్యాసంలో కనీవిని ఎరుగని కొత్త పరిసరాలు. సహచర విద్యార్థుల పరిచయాలు. మూడేళ్ల సీనియర్ల చిలిపి అల్లర్లు. అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల హుందాతనం. సరికొత్తల్యాబ్‌లు. ఇలా ఇంజినీరింగ్ కళాశాలలు కొత్తకొత్తగా ఉంటాయి. ఇంటర్ పూర్తి చేసుకుని జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని విద్యార్థులు సరికొత్త ఆశలతో నెలరోజుల క్రితం ఇంజినీరింగ్‌లో అడుగు పెట్టారు. ఈ సందర్భంగా వారి అనుభూతులపై కథనం..


పరిచయం చేసుకుంటున్న విద్యార్థులు

- కొత్త పరిసరాలు.. సరికొత్త పరిచయాలు
- ఇంజినీరింగ్‌లో అడుగుపెట్టిన ఫ్రెషర్స్
- లక్ష్యంవైపు తొలి అడుగు
- సీనియర్లు.. అధ్యాపకుల సహకారం
- విజయతీరాలకు చేరుతామంటున్న 'టెక్' స్టూడెంట్స్

అల్గునూర్(మానకొండూర్): తిమ్మాపూర్ శివారులో శ్రీచైతన్య, వాగేశ్వరి, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో ట్రిపుల్‌ఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్, కంప్యూటర్స్ కోర్సులు ఉన్నాయి. ప్రతీ కోర్సులో 60 మంది చొప్పున ప్రతీ కళాశాలలో ఈసారి 500 మంది విద్యార్థులు అడుగు పెట్టారు. మూడు కళాశాలల్లో కలిసి 1500 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు.

క్యాంపస్‌లో కొత్తకొత్తగా..

ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్నో ఆశలతో అడుగు పెట్టిన ఫస్టియర్ విద్యార్థులకు ఆయా కళాశాలలు అందమైన మొక్కలు, పచ్చని వాతావరణం స్వాగతం పలుకుతున్నాయి. విశాలమైన క్యాంపస్ పరిసరాలు వారిలో టెన్షన్ తొలగిపోయేలా చేస్తున్నాయి.

సీనియర్ల స్వాగతం

ఆయా కళాశాలల్లో చదువుతున్న సీనియర్ ఇంజినీరింగ్ విద్యార్థులు జూనియర్లకు సాదర స్వాగతం పలుకుతున్నారు. ఇంజినీరింగ్ అంటే సీనియర్ల ర్యాగింగ్, వేధింపులు ఉంటాయనుకున్న కొత్త విద్యార్థులు సీనియర్లు అందిస్తున్న సహకారం చూసి ఆశ్చర్యపోతున్నారు.

సీనియర్లతో పరిచయం

జూనియర్లు, సీనియర్లు పరిచయం చేసుకుంటున్నారు. సీనియర్లే జూనియర్ల తరగతి గదులకు వెళ్లి.. ప్రతీ విద్యార్థి నిర్భయంగా మాట్లాడేలా ప్రోత్సహిస్తున్నారు.. పరిచయం కొత్తగా, వినూత్నంగా ఉండాలని సూచిస్తున్నారు. కొత్తకొత్త ఆలోచనలు, భావన, ఊహలకు అవకాశం కల్పిస్తున్నారు.

అనుభవ పాఠాలు పంచుతూ..

సీనియర్లు మూడేళ్లుగా కళాశాలలో తాము నేర్చుకున్న పాఠాలు, అనుభవాలు జూనియర్లకు వివరిస్తున్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. తాము నేర్చుకున్న పాఠాలు, రికార్డులు, రైటింగ్ నోట్స్ అందించి వారికి ఉపయోగకరమైన అంశాల తెలియజేస్తున్నారు.

అధ్యాపకుల దిశానిర్దేశం

ఉన్నత లక్ష్యం.. అత్యున్నత ఆశయంలో కళాశాలలో అడుగుపెట్టిన నూతన విద్యార్థులకు ఆయా కళాశాలల్లోని అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రతీ విద్యార్థితో ముఖాముఖి పరిచయం చేసుకుని వారి లక్ష్యాన్ని, కుటుంబ నేపథ్యం గురించి తెలుసుకుంటున్నారు. ఆందోళన, భయం, టెన్షన్ ఫీల్‌అవుతున్నవారికి సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. గమ్యం వైపు ధైర్యంగా సాగేలా ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్‌లో అవకాశాల గురించి వివరిస్తున్నారు.

నాన్న ఆశయం నెరవేరుస్తా



మా స్వగ్రామం జగిత్యాల జిల్లా సారంగాపూర్. మానాన్న స్వామిరెడ్డిరైతు. మేము ఇద్దరం అన్నదమ్ములం. మమ్మల్ని ఉన్నత స్థితిలో చూడాలనేది నాన్న ఆశయం. ఆయన ఆశయం నెరవేరుస్తా. మెకానికల్ ఇంజినీర్ అవుతా.

– పి.రాకేశ్, మెకానికల్, వాగేశ్వరి కళాశాల

అమ్మానాన్నల కష్టం తీరుస్తా



మాది చొప్పదండి. అమ్మానాన్న వ్యవసాయం చేస్తూ కష్టపడి నన్ను చదివిస్తున్నారు. చిన్నతనం నుంచి మాకోసం వాళ్లు నిరంతరం శ్రమిస్తున్నారు. నేను బీటెక్ పూర్తిచేసి మంచి ఉద్యోగం సాధించి అమ్మానాన్న కష్టాలు తీరుస్తా.

– జాహ్నవి, సీఎస్ఈ, జ్యోతిష్మతి కళాశాల

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



మా స్వగ్రామం కొత్తపల్లి. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నాలక్ష్యం. టెక్నికల్ కోర్సులు చదవితే మంచి ఉద్యోగం వస్తుందనే ఈసీఈ కోర్సులో జాయిన్ అయ్యాను. కళాశాల వాతావరణం బాగుంది. సీనియర్లు సహకారం అందిస్తున్నారు.

– సాయిశ్రీజ, ఈసీఈ, శ్రీచైతన్య కళాశాల

కొత్త ఆవిష్కరణలకు ఆస్కారం



మన ఆలోచనలో కొత్తగా ఉండాలని ఎప్పుడూ మానాన్న అంటుంటారు. అందుకే నేను బీటెక్‌లో సివిల్ ఇంజినీరింగ్ కోర్సు ఎంచుకున్న. ఉన్నత చదువు చదివి నూతననిర్మాణాలు చేపడతా. మా కాలేజీలో సీనియర్ల ప్రోత్సాహం బాగుంది.

– సాహిత్య, సివిల్, శ్రీచైతన్య కళాశాల

విజయోస్తు...



కొత్తగా ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులు బీటెక్ విధ్య ఇంతవరకు చదివిన చదువుకు చాలా భిన్నమైనది. ఇంటర్‌లో నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేర్చుకునే సదావకాశం ఇది. మన కోసం తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారనే ఆలోచన మదిలో ఉండాలి. లక్ష్యం నిత్యం మన కళలో మెదలాలి. అప్పుడే విజయం మన దరిచేరుతుంది.

– జువ్వాడి సాగర్‌రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్

కలలు నిజం చేసుకోవాలి..



ప్రతీ విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలి. మా కళాశాలలో బీటెక్ ఫస్టియర్‌లో చేరిన విద్యార్థులంతా లక్ష్యసాధనకు మార్గాలు అన్వేశిస్తూ ఇక్కడకు వచ్చారని భావిస్తున్నాం. వారు గోల్ రీచ్‌కావడానికి సాకారం అందిస్తాం.విద్యార్థి వేసే ప్రతీ అడుగును నిశితంగా గమనిస్తాం.విజయ తీరాలకు చేరుస్తాం.

– గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, వాగేశ్వరి విద్యాసంస్థల కరస్పాండెంట్

ఉన్నత భవిత



ఉన్నత లక్ష్యంతో ఇంజినీరింగ్ చదివేందుకు మా కళాశాలలో అడుగు పెట్టిన ప్రతీ విద్యార్థి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుతాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కన్న కలలు, వారి ఆకాంక్షలు అధ్యయనం చేస్తాం. ప్రతీ విద్యార్థి శక్తి సామర్థ్యాలను అంచనా వేస్తాం. ఆదిశగా బోధన అందిస్తాం.

– ముద్దసాని రమేశ్‌రెడ్డి, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్

చూప
దివ
ఆగస్టు 25
చేశార
నేత్రదాన
ప్ర
కొనసా

ఒకరిగా
అంధుల
విస్తృత ప్రచా
ప్రారంభమైన '

కోల్‌సిటీ/కొత్తపల్లి: దేశం
చెందుతున్నారు. 12 లక్షల
న్నారు. వీరిలో 60శాతం 1
వర పెడుతున్నాయి. వీర
న్నారు. ఏటా 25వేల కొత్త కే
ముంటే కేవలం 40వేల
మొదటి స్థానంలో ఉండగా
వరకు జిల్లాలో వివిధ సంస్థ

కంటి కనుపాపపై అద్దం
కంటి వ్యాధి సోకిన
గించడం, కొన్ని సంద
లడం, పౌష్టికాహార
గాయాలు, ఇన్‌ఫెక్షన
దానం చేసిన నేత్ర

ఒకరి నేత్రదాన



వృత్తి ఇ
ప్రవృత్తి స

కరీంనగర్‌
కోల అన్నారెడ్డి
సమాజసేవ. ఇం
క్లబ్స్, రెడ్‌క్రాస్ సంస్థ, రేకుర్తి లం
బోర్డు సభ్యుడిగా సేవలందిస్తున్నా
నేత్రాలను సేకరించారు. చూపులేని
రు.2017లో న్యూఢిల్లీకి చెందిన
లెన్సీ అవార్డు, 2016లోలయన్స్
సొసైటీల షైనింగ్ స్టార్ అవా
గోల్డ్‌మెడల్, 2012లో అ
జీవిచే ప్రశంసా పత్రం
అవార్డు అం

'సర్వేంద్రియా
నాం నయనం
ప్రధానం'.. అన్నారు పెద్ద
లు. అందమైన సృష్టిని
చూడాలంటే కంటిచూపు
ముఖ్యం. చీకట్లో మగ్గుతున్న
వారెందరో కంటిచూపు కోసం ఎదురు
చూస్తున్నారు. మనం మరణించిన
తరువాత నేత్రాలు వృథాగా మట్టిలో కలవ
కుండా, బూడిద కాకుండా.. మరొకరిచి
నిద్దాం. మనకళ్లకు పునర్జన్మను ప్రసాదిద్దాం.
ంగత రాజీవ్‌గాంధీ, సోనియా గాంధీ 1986
న మొట్టమొదటి సారిగా నేత్రదాన వాగ్దానం
ు. నాటి నుంచి ఏటా దేశవ్యాప్తంగా జాతీయ
 పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం
ారంభమైన పక్షోత్సవాలు సెప్టెంబర్8 వరకు
గనున్నాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి' కథనం..



లోకాన్ని చూపిద్దాం

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం

- మరణించి... ఇద్దరిగా జీవిద్దాం
- ు కంటి చూపును ప్రసాదిద్దాం
- ారం చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు'

లో ఏటా కోటి మందికిపైగా వివిధ కారణాలతో మృతి
పైచిలుకు మంది కార్నియా అంధత్వంతో బాధపడుతు
2 సంవత్సరాలోపు చిన్నారులే ఉన్నారనే నివేదికలు కల
ంతా కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఎదురుచూస్తు
సులు నమోదవుతున్నాయి. రెండు లక్షనేత్రాలు అవసర
నేత్రాలను సేకరిస్తున్నారు. నేత్రదానంలో హైదరాబాద్
, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెండో స్థానం ఉంది. ఇప్పటి
్థల ద్వారా 6 వేలకు పైగా నేత్రాదాన అంగీకర పత్రాలు
సేకరించారు. 3100కు పైగా నేత్రాలు సేకరించారు.

కార్నియల్ అంధత్వం అంటే...

ా కనిపించే పొరనే కార్నియా(శుక్ల పటలం) అంటారు.
ా, గాయమైనా కార్నియా చెడిపోతే కంటి చూపు మంద
ర్భాల్లో చూపును కోల్పోవడం జరుగుతుంది. దెబ్బ తగ
ం తీసుకోకపోవడం, వంశపారంగా సంక్రమించే వ్యాధి,
 తదితర కారణాలతో కంటి చూపు మసకబారుతుంది.
త్రం ద్వారా కార్నియా మార్పిడితో, పోగొట్టుకున్న కంటి
చూపును తిరిగి పొందవచ్చు.

ఒకరి నేత్రాలు.. ఇద్దరికి చూపు

ంతో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చు. 6 గంటల లోపు
మరణించిన వ్యక్తి నేత్రాలు సేకరించాలి.
నేత్రదానం చేయడానికి వయస్సు పరిమితి లేవు. మరణించిన వ్యక్తి నేత్రాల్లోని కార్నియాను స్టెరైల్ పద్ధతి ద్వారా అనుభవజ్ఞులైన ఆఫ్తాలిమిక్ అసిస్టెంట్లు లేదంటే శిక్షణ పొందిన వైద్యసిబ్బంది సేకరిస్తారు. మరణించిన వ్యక్తి కంట్లోని టిష్యూ తడిగా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలి. నేత్రదానం చేయాలనుకున్న వారు దగ్గరలోని స్వచ్ఛందసంస్థలకు, ఐబ్యాంక్‌లకు సమాచారం ఇవ్వాలి. మరణించిన వ్యక్తి ఇదివరకే నేత్రాలు దానం చేస్తున్నట్లు ప్రతిజ్ఞ చేసినా, చెయ్యకపోయినా వారి కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను తీసుకోవచ్చు.

దానం చేసిన కళ్లు విక్రయించొద్దు

మనదేశంలో దానం చేసిన కళ్లకు కొరత ఏర్పడింది. కళ్లను తొలగించిన తర్వాత వాటిని ఐ బ్యాంకులో విశ్లేషించి ప్రాసెస్ చేస్తారు. కార్నియాను 96 గంటలలోపు ట్రాన్స్‌ప్లాంట్ చేస్తారు. ఐ బ్యాంకులు మానవ అవయవ మార్పిడి చట్టం పరిధిలోకి వస్తాయి. దానం చేసిన కళ్లను కొనరాదు, విక్రయించరాదు. అది చట్ట ప్రకారం నేరం.

విస్తృత ప్రచారం...

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని పలు స్వచ్ఛంద సంస్థలు నేత్రదానం ఆవశ్యకతపై కరపత్రాలు, సినిమా స్లైడ్స్. గోడప్రతులు ద్వారా ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థలు, కరీంనగర్‌లో రేకుర్తి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నారు. గోదావరిఖనికి చెందిన 'సదాశయ ఆర్గాన్ ఫౌండేషన్' సంస్థ విస్తృత ప్రచారం చేస్తోంది.

ంజినీర్..
సమాజసేవ

ోని కాపువాడకు చెందిన
ి వృత్తి ఇంజినీర్. ప్రవృత్తి
ినీర్‌గా లయన్స్, అలయన్స్
న్స్ క్లబ్ కంటి ఆసుపత్రి ట్రస్టు
రు. ఇప్పటి వరకు 4 వేలకు పైగా
 వారికి కంటిపాపగా నిలుస్తున్నా
్వచ్ఛందసంస్థ ఎడ్యూకేషన్ ఎక్స్
 క్లబ్, అలయన్స్ క్లబ్, రెడ్‌క్రాస్
ార్డు, 2014లో రాజీవ్‌గాంధీ
ప్పటి కేంద్రమంత్రి చిరం
 2012లో పీఎంజీఎఫ్
దుకున్నారు.



మరణించిన వ్యక్తినుంచి నేత్రాలు స్వీకరిస్తున్న వైద్యులు



కోల అన్నారెడ్డికి సన్మానం (ఫైల్)

నేత్రాలు సేకరించే సంస్థలు

- జిల్లా ప్రధానాస్పత్రి నేత్రదాన సేకరణ కేంద్రం: 0878-2240337
- లయన్స్ క్లబ్ ఉదార కంటి ఆస్పత్రి రేకుర్తి, కొత్తపల్లి మండలం: 0878-2253131, 2285318
- లయన్ కోల అన్నారెడ్డి, నేత్రవైద్యశాల ట్రస్టుబోర్డు సభ్యుడు: 9849059538
- టి.శ్రవణ్‌కుమార్, సదాశయ ఆర్గాన్ ఫౌండేషన్, గోదావరిఖని: 9848609591
- తానిపర్తి గోపాల్‌రావు, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, నేత్రాల సేకరణ ఇన్‌చార్జి: 9849084589
- ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ హైదరాబాద్: 9849545822, 040-23548266
- ఐ బ్యాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ: టోల్‌ఫ్రీ 1919/1053

నేత్రదానానికి ప్రతిజ్ఞ చేశా



మరణానంతరం నా రెండు కళ్లు దానం చేయ్యడానికి 2014 ఆగస్టులో ప్రతిజ్ఞ చేశా. చూపులేని అంధులను చూస్తుంటే బాధగా ఉంటుంది. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన రావాలి. ప్రతీ ఒక్కరూ నేత్రాలు దానం చేయడానికి ముందుకు రావాలి.

– కొంకటి లక్ష్మీనారాయణ, రామగుండం నగర మేయర్

220 మందికి చూపునిచ్చాం



సదాశయ ఆర్గాన్ ఫౌండేషన్ ద్వారా 400కు పైగా కార్యక్రమాలు చేపట్టడంతో నేత్ర, అవయవదానంపై వేలాది మంది ముందుకు వచ్చారు. ఇప్పటి వరకు మరణించిన 110 మంది నుంచి కార్నియాలను సేకరించి. 220 మందికి కంటి చూపును అందించడానికి కృషి చేశాం.

– టి.శ్రవణ్‌కుమార్, గోదావరిఖని

ప్రత్యేక చట్టం రావాలి




మనిషి మరణించాక కళ్లు వృథాకాకుండా నేత్ర దానం చేయండి. ఇందు కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. కొన్ని దేశాల్లో మృతదేహాలను ప్రభుత్వం స్వాదీనం చేసుకొని అవయవాలను మరొకరిని అమర్చుతుంది. ఈ దిశగా కృషి చేయాలి.

– డి.నిరంజన్, నేత్ర వైద్యనిపుణులు

ఆమెకు అండగా..181

- నిర్భయ చట్టంతోపాటు షీటీంలు
- నూతనంగా 181 టోల్‌ఫ్రీ..
- కవ్వింపు చర్యలకు పాల్పడితే కటకటాలకే
- జిల్లాలో లాంఛనంగా ప్రారంభానికి కసరత్తు

మహిళలను,విద్యార్థినులను వేధిస్తే కటకటాల్లో చిప్పకూడు తినాల్సిందే. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు వేసింది. ఆమెకు అండగా టోల్‌ఫ్రీం నంబర్ '181' సేవలను శనివారం నుంచి అధికారికంగా అందుబాటులోకి తీసుకొచ్చింది.



సిరిసిల్లక్రైం: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళల రక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటికే షీటీంలను తీసుకువచ్చి పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. దీనిలో పోలీస్‌వ్యవస్థ మఫ్టీలో ఉండి సేవలందించాయి. మహిళలు వారి సమస్యలను పోలీసులకు వివరించేందుకు కాస్త ఇబ్బంది పడుతున్న క్రమంలో నేరుగా మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యం లోనే టోల్‌ఫ్రీ నంబర్ 181ను అందుబాటులోకి తెచ్చారు.

'181' పనితీరు

మహిళలకు పూర్తిఅండగా '181' పని చేస్తుంది. గృహ హింస, పని చేసే చోట వేధింపులు, లైంగిక వేధింపులు, కట్నవేధింపులు, ఆడపిల్లల అమ్మకం, రవాణాల నివారణకు, సలహా, స్వాంతన, రక్షణగా ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

హైదరాబాద్ కేంద్రంగా..

మహిళలకు సమాజంలో ఎదురయ్యే ఏలాంటి సమస్యలకైనా సలహా, సూచనలు అందించడంతోపాటు అవసరమైన సందర్భంలో రక్షణ కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా '181' సేవలను అందుబాటులో తెచ్చింది. గతంలో నేరాలను అదుపు చేయడానికి ఎలాగైతే పోలీస్‌శాఖలో '100' టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోఉందో అదే స్థాయిలో ఇదీ 24గంటలు అందుబాటులో ఉంటుంది. సమస్యను తెలపగానే దానికి సంబంధించిన ఏరియా అధికారులకు సమాచారం అందించిన మహిళకు అవసరమైన సేవలను అందించే వీలుంది.

జిల్లాకు అనుసంధానం

జిల్లాస్థాయిలో అంతర్గత ఫిర్యాదుల కమిటీతోపాటు స్థానిక ఫిర్యాదుల కమిటీని సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. కమిటీలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఐసీపీఎస్, ఐసీడీఎస్, పోలీస్‌శాఖతోపాటు ఇతరశాఖలకు చెందిన వారితో స్థానిక ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

నేడు పోస్టర్ ఆవిష్కరిస్తాం



ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడానికి టోల్‌ఫ్రీ నంబర్ 181 ద్వారా సేవలందించడానికి నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే రాష్ట్రస్థాయిలో మాకు అన్ని విషయాలను వివరించారు. జిల్లాలోని మహిళలకు, విద్యార్థినులకు, దీనిపై పూర్తి అవగాహన రావడానికి కృషిచేస్తాం. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరిస్తున్నాం. – సరస్వతి, మహిళా సంక్షేమ అధికారి, రాజన్న సిరిసిల్ల

సమాచారం లేదు



మహిళల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 181 వచ్చిందన్న అధికారిక సమాచారం మాకు లేదు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించడానికి షీటీంలను ప్రస్తుతం కొనసాగిస్తున్నాం. ఆదేశాలు వస్తే మహిళా సంక్షేమానికి అవసరమైన సేవలు అందిస్తాం.

– చంద్రశేఖర్ అవధాని, ఇన్‌చార్జి డీఎస్పీ, సిరిసిల్ల

పకడ్బందీగా అమలు చేయాలి



మహిళలకు రక్షణగా చట్టాలు వస్తున్నాయి. కానీ వాటిని క్షేత్రస్థాయిలో అమలు విషయంలో జాప్యం జరుగుతుంది.షీటీంలలో చర్యలు బాగున్నాయి. ఇలాంటి సందర్భంలో మహిళలకు సలహాలు, స్వాంతన, రక్షణకు ప్రభుత్వం తెచ్చిన 181 సేవలను పకడ్బందీగా అమలు చేయాలి.

– చందన, అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు, రాజన్న సిరిసిల్ల

ఈఈని వెంటనే అరెస్ట్ చేయాలి

- శ్రీకాంత్ కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- ఈఎన్‌సీని బాధ్యుడిని చేయాలి
- సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి



ఎండపెల్లిలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

వెల్గటూరు(ధర్మపురి): ఉన్నతాధికారి వేధింపులతోనే దేవి శ్రీకాంత్ మృతి చెందాడని, ఈఈని వెంటనే అరెస్టు చేయాలని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెల్గటూర్ మండలంలోని ఎండపెల్లిలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మాట్లాడారు. యువ ఇంజినీర్ మృతి చెందిన ఘటన టీఆర్ఎస్ అవినీతికి నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి పనికి పర్సంటేజీలు నడుస్తున్నాయన్నారు. ఈ వ్యవహారం తెలియని యువ ఇంజినీర్ శ్రీకాంత్‌ను మామూళ్లు ఇవ్వడం లేదని, కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లు చేపట్టడంలేదని ఈఈ వేధింపులకు గురి చేశాడన్నారు. శ్రీకాంత్ ఆత్మహత్యకు ఈఈనే బాధ్యత వహించాలన్నారు. ఈఘటనలో ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డిని కూడా బాధ్యుడ్ని చేయాలన్నారు. శ్రీకాంత్ మృతి చెంది మూడు రోజులు గడుస్తున్నా ఈఈపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ఉద్యోగంనుంచి సస్పెండ్ చేసి అరెస్టు చేయాలన్నారు. శ్రీకాంత్ భార్యకు ఉద్యోగం, రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జెడ్పీ మాజీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ చుక్క శంకర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండాటి రాజేశ్వర్‌రెడ్డి, బండ శంకర్, సర్పంచ్ గుండాటి జితేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, గుమ్ముల సతీశ్, లింగారెడ్డి, కరుణాకర్, దుర్గం శ్రీనివాస్, మొగిలి, కిరణ్ ఉన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

జగిత్యాల టౌన్: జగిత్యాలలో సెప్టెంబర్ 9,10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బి. అనంత్ రెడ్డి తెలిపారు. 46 మంది బాలురు, 36 మంది బాలికలు క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. బాలుర జట్టులో కందుకూరి రశ్మిత్ పటేల్, పవన్, సిద్దు, చందు, శ్రేయస్, ముఖేష్ రెడ్డి, ప్రవీణ్, శ్రీవిష్ణు, జయవర్ధన్, శశాంక్, హర్షత్, సాయిశ్రీ వైష్ణవ్, కార్తిక్, విజయ్, సాయికిరణ్, సాయిశ్రీ, బాలికల విభాగంలో సంధ్య, హేమలత, రేణుక, సరిత, శిల్ప, హర్షిత, శ్రీహస, శ్రీఖరి, అంజూమ్, శ్రీవిద్య, ప్రియ చైతన్య, వైష్ణవి, సంతోషిణి, హర్షిణి, మానస, నవ్యలు ఎంపిక అయినట్లు తెలిపారు.

ఉపాధి కల్పిస్తామన్న ప్రచారం నమ్మొద్దు

- గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

రాయికల్(జగిత్యాల): విదేశాల్లో ఉపాధి కల్పిస్తామన్న ప్రచారాన్ని నమ్మొద్దని గల్ఫ తెలంగాణ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. దుబాయ్‌లోని గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎలాంటి కార్యదర్శులను నియమించలేదనితెలిపారు. తమ సంఘం పేరిట అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో ఉచితంగా వీసాలు, ఉపాధి కల్పిస్తామని కొంతమంది ప్రచారం చేస్తున్నారన్నారు. అలాంటి ప్రచారాన్ని తాము ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు అవసరం ఉన్న వారు టామ్‌కామ్ ద్వారా సంప్రదించవచ్చన్నారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



కోడెమొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్న ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారిని దాదాపు 15వేల మంది దర్శించుకున్నారు. భక్తుల రద్దీని గమనించిన ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలను నిలిపివేసి, లఘు దర్శనాలను మాత్రమే కొనసాగించారు. సోమవారం సైతం గర్భగుడి దర్శనాలు రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రాణం తీసిన కంచె..

- అడవిపందుల కోసం ఏర్పాటు చేసిన కంచె తగిలి ప్రమాదం

రుద్రంగి(వేములవాడ): అడవిపందుల బెడదతో పంటను కాపాడుకునేందుకు ఓ రైతు తన చేనుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె ఓ గిరిజన మహిళా రైతు ప్రాణాలు తీసింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలం మానాల గ్రామశివారులోని రుక్మానాయక్‌తండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తండావాసుల వివరాల మేరకు.. తండాకు చెందిన బుక్యాకవిత(32) ఆదివారం ఉదయం గ్రామశివారులోని ఇనుపరాయి గుట్టప్రాంతంలో ఉన్న తమ వ్యవసాయపొలం వద్దకు వెళ్లింది. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి పయనమైంది. మార్గమధ్యలో ఇదేతండాకు చెందిన బుక్యా అంబరిశ్రీను పత్తిచేను చుట్టూ ఏర్పాటు చేసి విద్యుత్‌తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి 7.30 గంటైనా కవిత ఇంటికి రాకపోవడంతో భర్త బుక్యా గంగారెడ్డి పొలం వద్దకు వెళ్తుండగా పత్తిచేను వద్ద కవిత శవమై కనిపించింది. ఆందోళన చెందిన ఆయన కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు.వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. మృతురాలికి నాలుగేళ్ల కూతురు ఉంది. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

అభ్యుదయ కవి తోట మహదేవ్ అస్తమయం

- సంతాపం తెలిపిన విరసం నేతలు వరవరరావు, కె.శివారెడ్డి
- చంద్రంపేటలో అంత్యక్రియలు
- హాజరైన కవులు, రచయితలు



తోట మహదేవ్

సిరిసిల్ల: అభ్యుదయ కవి, విప్లవ రచయితల సంఘం(విరసం) మాజీ సభ్యులు తోట మహదేవ్(58) ఆదివారం అస్తమించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాకకు చెందిన మహదేవ్ 1982– 84 ప్రాంతంలో అభ్యుదయ కవిగా పలు రచనలు చేశారు. అప్పటి పరిస్థితులపై మహదేవ్ పలు రచనలు చేశారు. అప్పటి పత్రికల్లో విమర్శణాత్మక వ్యాసాలు, సంపాదయకీయాలు రాశారు. ఆయన రాసిన 'సంకెళ్లు' 'మంటలు', 'ఉరుములు మెరుపులు', 'తూర్పు', 'కల్లోలం' వంటి రచనలు అభ్యుదయ కవిగా గుర్తింపునిచ్చాయి. మహదేవ్ సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో క్లర్క్‌గా 1983లో చేరి ఎస్టేట్ ఆఫీసర్‌గా 2017 ఫిబ్రవరి 28న పదవీ విమరణ చేశారు. సిరిసిల్ల మండలం చంద్రంపేటలో స్థిరనివాసం ఏర్పచుకున్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్‌లో చేరారు. ఆదివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. చంద్రంపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. మహదేవ్‌కు భార్య నీరజ, పిల్లలు అంజలి, ఆమని, అర్జున్, అశ్విని ఉన్నారు. మహదేవ్ మృతిపై విరసం నేత వరవరరావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి సంతాపం తెలిపారు. తెలంగాణ రచయితల వేదిక ప్రతినిధులు, సాహిత్యకారులు జూకంటి జగన్నాథం, నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్, మద్దికుంట లక్ష్మణ్, చైతన్యప్రకాశ్, ఆడెపు లక్ష్మణ్ తదితరులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి



కనుక్కోండి

కింద ఉన్న బొమ్మల్లో రెండు బొమ్మలు ఒకేలా ఉన్నాయి. అవేమిటో కనుక్కోండి.



మీకు తెలుసా?



జింకలు పుట్టిన అరగంటకే నడుస్తాయి



డైనోసార్లు భూమ్మీద 150 మిలియన్ సంవత్సరాలు బతికాయి

నాన్నా చెప్పవా?

ఎక్స్‌రే టెలిస్కోపులు దేనికోసం ఉపయోగిస్తారు


కాంతితాలూకు విభిన్న రూపాలలో కేవలం మన కంటికి కనిపించే కాంతి మాత్రమేగాక రేడియో తరంగాలు, సూక్ష్మతరంగాలు, పరారుణ కాంతి, అతినీలలోహిత కాంతి, ఎక్స్–కిరణాల కాంతి, గామా కిరణాల కాంతి ఉన్నాయి. విశ్వంలోని వివిధ ఖగోళ పదార్థాల ధర్మాలను, వాటి ఉష్ణోగ్రతలనుబట్టి వేర్వేరు రకాలకు చెందిన కాంతి వాటి నుంచి ఉద్గారమవుతుంది. ఉదాహరణకు సున్నా డిగ్రీ సెల్సియస్ కన్నా కొన్ని వందల డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతతో ఉండే వస్తువుల నుంచి చాలా తక్కువ శక్తితో కూడిన రేడియో, ఇంకా



మైక్రోవేవ్ కాంతి కణాలు విడుదలవుతుంటాయి. సున్నా డిగ్రీ కన్నా ఎగువన కొన్ని వందల డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉండే వస్తువులనుంచి ఎక్కువగా పరారుణ కాంతి విడుదలవుతుంటుంది. లక్షలాది డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉండే ఖగోళ రాశుల నుంచి వెలువడే శక్తి ప్రధానంగా ఎక్స్–రే కిరణాల వంటి వాటి రూపంలో ఉంటుంది. ఉదాహరణకు నక్షత్ర మండలాల్లో చోటుచేసుకునే భారీ విస్ఫోటనాలు, తీవ్రంగా ఉండే అయస్కాంత క్షేత్రాలు, అతి శక్తివంతమైన గురుత్వాకర్షణ క్షేత్రాలు, న్యూట్రాన్ తారలు, కృష్ణ బిలాలు (బ్లాక్ హోల్స్) ఎక్స్–రే కిరణాల వంటి శక్తినే ఎక్కువగా విడుదల చేస్తుంటాయి. అయితే ఈ తరహా కాంతిని మనం మామూలు టెలిస్కోపులతో గ్రహించి, విశ్లేషించడానికి వీలు కాదు. మనకంటికి కనపించే కాంతి దర్పణాలపై పడినప్పుడు పరావర్తనం చెందితే, ఎక్స్–రే కిరణాలు మాత్రం అందులోంచి చొచ్చుకుని ముందుకు సాగిపోతాయి. అందుకని విశ్వంలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఎక్స్ కిరణాలను సేకరించి, ఆయా ఖగోళ పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనేందుకు మామూలు టెలిస్కోపులకు బదులుగా ప్రత్యేకంగా రూపొందించే ఎక్స్–రే టెలిస్కోపులను ఉపయోగిస్తారు.

దారి కనుక్కోండి

మధ్యలో ఉన్న తాళంచెవితో ఒక డోర్ ఓపెన్ చేసుకుని బయటికి వచ్చే మార్గం కనుక్కోండి. తాళంచెవితో ఒక డోర్ మాత్రమే ఓపెన్ అవుతుంది.



గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి


mango
onion
ladder
bamboo
peanut
lolipop
compost
apricot




e	u	t	u	n	a	e	p	l
e	e	f	e	z	i	t	r	o
t	j	p	s	j	u	o	e	l
s	r	o	t	s	g	c	d	i
o	k	n	s	j	w	i	d	p
p	a	i	z	o	e	r	a	o
m	w	o	b	f	s	p	l	p
o	e	n	o	g	n	a	m	v
c	c	b	a	m	b	o	o	o

నీడను గుర్తించండి

కింద ఇచ్చిన 5 నీడల్లో పైన ఉన్న డైనోసార్ అసలైన నీడ ఏదో గుర్తించండి



కింద ఇచ్చిన చేప బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి





వెండితెర



జబ్‌హరీ..మెట్‌సెజల్: దుర్గరాజా కళామందిర్ (జగిత్యాల) 11.30, 2.30, 6.30,9.30

లై : శ్రీనివాస (జగిత్యాల– 221333) 11.30, 2.30,6.00,9.00

ఫిదా: బాలాజీ (జగిత్యాల– 2212 65) 11.00, 2.00, 6.00, 9.00

దర్శకుడు: నటరాజ్(జగిత్యాల– 221263) 11.00, 2.00, 6.00, 9.00

నేనే రాజు నేనే మంత్రి: శ్రీరామ (జగిత్యాల) 11.00, 2.00, 6.00, 9.00

ఆకట్టుకుంటున్న గణనాథులు



శ్రీగణసేన యూత్ ఆధ్వర్యంలో కృష్ణానగర్‌లో గణపతి



మేడిపల్లి: కాచారంలో రెడ్డి సంఘం వినాయకుడు

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలో గణనాథులు పూజలు అందుకుంటున్నారు. వివిధ సంఘాల అధ్వర్యంలో సుమారు నాల్గు వందల వరకు గణనాధులను ఏర్పాటు చేశారు. మండపాల వద్ద అలంకరణలు చేపడుతున్నారు. ప్రతీరోజు ఉదయం సాయంత్రం భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

మేడిపెల్లి: మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వినయక మండపాలు ఆకట్టుకొంటున్నాయి. భక్తులు, మహిళలు, యువకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆదివారం మండలంలోని కాచారంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడితో పాటు మన్నెగూడెంలో సార్వజనీక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. కొండాపూర్‌లో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

రాయికల్: మండలంలో వివిధ రూపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయికల్‌లోని బుద్ధుని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిష్ఠించిన గణనాథులు అందరిని అకట్టుకున్నారు.

బీర్‌పూర్: మండలంలోని కొల్వాయి గ్రామంలో హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ సులోచన, సింగిల్‌విండో చైర్మన్ రమేశ్, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్, హనుమాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



రాయికల్: బుద్ధుడి ఆకారంలో రాయల్ యూత్ గణపతి



రాయికల్: ఎడ్లబండిపై గణపతి



జగిత్యాల: వీక్లీ బజార్‌లో

వైద్య శిబిరానికి స్పందన

మేడిపెల్లి: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం సుజోకి థెరఫీ ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు కాళ్లు, కీళ్ల నొప్పులతో పాటు ఇతర నొప్పులతో బాధపడుతున్న వారికి కూడా పరీక్షలు నిర్వహించారు. దాదాపు 100మందికి పరీక్షల నిర్వహించి మందులను అందజేశారు. ఇందులో సుజోకి థెరఫీ వైద్యులు ఎడ్మల వనిత, కొంకవేని గంగాధర్, శ్రీపాద వెంకటేశ్వర్లు, శివమణి, లక్ష్మారెడ్డి, శైలేందర్, లింగామూర్తి, జ్యోతిలతో పాటు సర్పంచ్ బొంగోని రాజాగౌడ్, ఎంపీటీసీ దాసరి శంకర్, హెచ్‌ఎం మహిపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

Zone Guide

సమావేశాలు

మేడిపెల్లి: మండల కేంద్రంలో నవజ్యోతి, వల్లంపెల్లిలో వల్లంపెల్లి గ్రామైఖ్య సంఘాల సమావేశం సోమవారం ఉంటుందని ఆయా గ్రామాల వీవోఏలు తెలిపారు.

వైద్యసేవలు

మేడిపెల్లి: మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం జనరల్ కేసులతో పాటు టీబీ పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు.

104 వైద్యసేవలు

మేడిపెల్లి: మండలంలోని భీమారం, రంగాపూర్ గ్రామాలలో సోమవారం 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందిస్తారు.

నేడు అన్నదానం

మేడిపెల్లి: మండలంలోని కొండాపూర్‌లో యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు

రాయికల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28తో డిగ్రీ కళాశాల ప్రవేశ గడువు ముగుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలుగనివ్వం

జగిత్యాల: ప్రాజెక్టుల నిర్మాణంతో రైతులకు ఎంతో మేలని, అన్నదాతకు ఇబ్బందులు కలుగనివ్వమని, కాంగ్రెస్ నాయకులకు ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూస్తున్నారని టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులులేకుండా తక్కువ భూమి సేకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి రైతుల పక్షపాతి అని, అందుకోసమే కేసీఆర్‌కు అగ్రికల్చర్ లీడర్‌షిప్ పురస్కారం లభించందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నరన్నారు. జగిత్యాలలో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ధరూర్ ఫిల్టర్‌బెడ్ ఇంత వరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికై నా కాంగ్రెస్ నాయకులు ఆసత్యపు ప్రచారాన్ని మానుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. గట్టు సతీష్, రౌతు గంగాధర్, నక్కల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రాయికల్: సేవా రంగంలో మథర్‌థెరిస్సాను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు పనిచేయాలని జోన్ చైర్పర్సన్ మోర హన్మాండ్లు అన్నారు. మథర్‌థెరిస్సా జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలైన చంద్రప్రకాష్, నాగరాజు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకన్న, సలీం, పుష్పలత, దేవలక్ష్మి, షాకీర్‌అలీ, వేణు,నజీంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మథర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. సర్పంచ్ రాజరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భూమయ్య, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, ప్రధానకార్యదరి అనిల్, ఉపాధ్యక్షుడు శేఖర్, సభ్యులు రమేశ్, ఆనందం, మల్లేశం, రాజేందర్, స్వామి, దివాకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు పెరుగుతాయి

రాయికల్: క్రీడల ద్వారా యువకుల్లో స్నేహ సంబంధాలు పెరుగుతాయని ఎస్సై శివకృష్ణ అన్నారు. ఆదివారం భవానిభరత్ యూత్ ఆధ్వర్యంలో పట్టణస్థాయి కబడ్డీ పోటీలను ఎస్సై శివకృష్ణ ప్రారంభించారు. పోటీల్లో విన్నర్‌గా స్థానిక జెడ్పీ ఎస్‌ఎస్ పూర్వవిద్యార్థులు, రన్నర్‌గా కృష్ణవేణి ఉన్నత పాఠశాల జట్టు నిలిచింది. కార్యక్రమంలో సర్పంచ్ రాజరెడ్డి, ప్రముఖ పిల్లల వైద్యులు మోర సుమాన్‌కుమార్, ప్రముఖ సామాజిక సేవాకుడు కట్కం రవి, సంఘ అధ్యక్షులు గంగాధర్, ప్రధానకార్యదర్శి బందెల శ్రీనివాస్, నిర్వాహకులు ప్రసాద్; గంగాధర్, పులి రమేష్, శ్యాం, గంగరాజం, రాజశేఖర్, మచ్చసుదర్శన్, కైరం సుదర్శన్ దివాకర్,తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

గంగాప్రసాద్
అంశం : సబ్సిడీ గొర్రెలు
పశువైద్యాధికారి, మేడిపల్లి



మేడిపెల్లి:

ప్రశ్న: మేడిపెల్లి మండలంలో ఎంతమంది సబ్సిడీ గొర్రెల యూనిట్లకు దరఖాస్తులు చేసుకున్నారు. మొదటి విడత ఎంతమందిని ఎంపిక చేశారు.?

జవాబు: మండలంలోని మొత్తం 24 గ్రామాల్లో 1280 మంది సబ్సిడీ గొర్రెల యూనిట్లకు దరఖాస్తులు చేసుకొన్నారు. మొదటి విడతగా 639 మందిని ఎంపిక చేశాం.

ప్రశ్న: ఇప్పటివరకు ఎన్ని యూనిట్లు గ్రౌండింగ్ చేశారు.?

జవాబు: 270 గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయి. మిగతా యూనిట్లను డిసెంబర్ 31 లోగా పూర్తి చేస్తాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని సబ్సిడీ గొర్రెలు మృతి చెందాయి.?

జవాబు: సబ్సిడీ గొర్రెల్లో దాదాపు 30 వరకు మృతి చెందినట్లు లబ్ధిదారులు తెలిపారు. వాతావరణ ప్రభావంతో ఇలా జరుగుంది. మృతి చెందిన గొర్రెలకు ఇన్సురెన్స్ వచ్చేలా చూస్తాం.

ప్రశ్న: గొర్రెలు, మేకల రక్షణకు మీరిచ్చే సలహాలు ఏమిటి.?

జవాబు: ప్రస్తుతం కొత్తగడి, వర్షం వల్ల గొర్రెలు, మేకలకు పుర్రురోగంతో పాటు ఇతర వ్యాధుల వచ్చే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా పీపీఆర్ టీకాలు ఇస్తున్నాం. వీటితో పాటు బలం మందులు, ఇతర మందులు వాడాలి. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి.

భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న భారతదేశ దీవి?



ముల్కల రమేష్
సబ్జెక్టు నిపుణులు

మాదిరి ప్రశ్నలు

1. న్యూమూర్ దీవులు ఏ ప్రాంతంలో ఉన్నాయి?
   1) మన్నార్ సింధుశాఖ
   2) చిలకా సరస్సు
   3) గంగా-బ్రహ్మపుత్ర డెల్టా
   4) గోదావరి డెల్టా
2. దీవులు, అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఫిరం దీవులు – కథియవార్ తీరం
   2) నొరా దీవులు – కచ్ తీరం
   3) ఆలియా బెట్ దీవులు – నర్మద, తపతి ముఖద్వారం
   4) ఎలిఫెంటా – కొచ్చిన్ తీరం
3. 'బాలాసోర్' దీవి ఏ ప్రాంతంలో ఉంది?
   1) చిలక సరస్సు 2) కొల్లేరు సరస్సు
   3) పులికాట్ సరస్సు
   4) మన్నార్ సింధుశాఖ
4. దీవులు, అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
   i) వైఫిన్ a) మన్నార్ సింధుశాఖ
   ii) సాగర్ b) కథియవార్ తీరం
   iii) పాంబన్ c) కొచ్చిన్ తీరం
   iv) బైసాలా d) గంగాడెల్టా
   1) i-b, ii-c, iii-d, iv-a
   2) i-c, ii-d, iii-a, iv-b
   3) i-b, ii-d, iii-a, iv-c
   4) i-c, ii-a, iii-d, iv-b
5. 'అబ్దుల్ కలాం దీవి' ఏ రాష్ట్రంలో ఉంది?
   1) తమిళనాడు 2) కేరళ
   3) గుజరాత్ 4) ఒడిశా
6. 'కరంజ' దీవి ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
   3) మహారాష్ట్ర 4) కర్ణాటక
7. కింది వాటిలో సరికానిది ఏది?
   1) వైడా, డయ్యు దీవులు కచ్ తీరంలో ఉన్నాయి
   2) సాల్‌సెట్టి దీవులు కథియవార్ తీరంలో ఉన్నాయి
   3) సాగర్ దీవులు పశ్చిమ బెంగాల్‌లో ఉన్నాయి
   4) క్రొకడైల్ దీవులు మన్నార్ సింధుశాఖలో ఉన్నాయి
8. 8° చానల్ ఏ దీవి ద్వారా వెళుతోంది?
   1) మినికాయ్ దీవి 2) సుహేలి దీవి
   3) న్యూమూర్ దీవి 4) పాంబన్ దీవి
9. కింది వాటిలో సరికానిది ఏది?
   1) 'డంకన్ పాసేజ్' అనేది దక్షిణ అండమాన్, లిటిల్ అండమాన్ దీవుల మధ్య ఉంది
   2) సుహేలి దీవికి, మినికాయ్ దీవులకు మధ్య 9° చానల్ ఉంది
   3) కోకో దీవికి, అండమాన్ దీవులకు మధ్య 'కోకో చానల్' ఉంది
   4) అమీన్ దీవులు గుజరాత్ రాష్ట్రంలో ఉన్నాయి
10. 'మాజులీ' దీవి ఏ నది మూలంగా ఏర్పడింది?
    1) గంగా 2) కృష్ణా
    3) సింధూ 4) బ్రహ్మపుత్ర
11. 'గల్ఫ్ ఆఫ్ మన్నార్' ఎక్కడ ఉంది?
    1) గుజరాత్‌కు పశ్చిమం వైపు
    2) తమిళనాడుకు తూర్పు వైపు
    3) పశ్చిమబెంగాల్‌కు ఉత్తరం వైపు
    4) ముంబైకి దక్షిణం వైపు
12. మినికాయ్, మాల్దీవులను వేరు చేసే జల మార్గం ఏది?
    1) 9° జలమార్గం 2) 8° జలమార్గం
    3) కోకస్ జలమార్గం
    4) సెయింట్ జార్జెస్ జలమార్గం
13. మినికాయ్ దీవి ఏ ప్రాంతంలో ఉంది?
    1) అండమాన్ 2) నికోబార్
    3) లక్షదీవులు 4) మన్నార్ సింధుశాఖ
14. కింది వాటిలో భారత్, శ్రీలంక మధ్య ఉన్న ద్వీపాలు ఏవి?
    1) ఎలిఫెంటా 2) నికోబార్
    3) రామేశ్వరం 4) సాల్సెట్టి
15. కింది వాటిలో సరైంది ఏది?
    1) లక్షదీవులు 'ప్రవాళ భిత్తిక'లతో ఏర్పడ్డాయి
    2) లక్షదీవుల మొత్తం విస్తీర్ణం 32 చ.కి.మీ.
    3) లక్షదీవుల్లో అతి పెద్ద దీవి 'కచ్చల్' దీవి
    4) లక్షదీవుల్లో జనాభా లేని దీవి – పిట్లీ
16. పాంబన్ దీవి ఏ రెండు దేశాల మధ్య ఉంది?
    1) భారత్, పాకిస్తాన్
    2) భారత్, శ్రీలంక 3) భారత్, బంగ్లాదేశ్
    4) భారత్, మయన్మార్
17. 'కపిలధార' జలపాతం ఏ నదిపై ఉంది?
    1) నర్మద 2) తపతి
    3) కృష్ణా 4) ఇంద్రావతి
18. దేశంలోని జలపాతాలు, అవి ఉన్న నదులకు సంబంధించి కింది వాటిలో సరికానిది?
    1) పైకారా జలపాతం – కావేరి నది
    2) కుంతాల జలపాతం – కడెం నది
    3) డుడుమా జలపాతం – వంశధార నది
    4) చిత్రకూట్ జలపాతం – ఇంద్రావతి నది
19. ధువన్‌ధార జలపాతం ఏ నదిపై ఉంది?
    1) మహానది 2) కావేరి
    3) కృష్ణా 4) నర్మద
20. జలపాతాలు, అవి ఉన్న నదులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
    జలపాతం నదులు
    i) జోగ్ a) సువర్ణరేఖ
    ii) యెన్నా b) కావేరి
    iii) శివసముద్రం c) కృష్ణా
    iv) హుంద్రు d) శరావతి
    1) i-d, ii-a, iii-b, iv-c
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-d, ii-b, iii-a, iv-c
    4) i-b, ii-a, iii-d, iv-c
21. హుంద్రు జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మధ్యప్రదేశ్ 2) బిహార్
    3) జార్ఖండ్ 4) కర్ణాటక
22. జలపాతాలు, అవి ఉన్న రాష్ట్రాలకు సంబంధించి సరికానిది ఏది?
    1) ధువన్‌ధార – మధ్యప్రదేశ్
    2) శివసముద్రం – పశ్చిమ బెంగాల్
    3) జొరసొప్పా – కర్ణాటక
    4) చిత్రకూట్ – చత్తీస్‌గఢ్
23. 'తలకోన' జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తెలంగాణ 2) ఆంధ్రప్రదేశ్
    3) కర్ణాటక 4) మహారాష్ట్ర



జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ
ప్రత్యేకం

24. కపిలధార జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) పశ్చిమ బెంగాల్
    2) హిమాచల్‌ప్రదేశ్ 3) మధ్యప్రదేశ్
    4) కర్ణాటక
25. 'గహిర్మాత' బీచ్ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) పశ్చిమ బెంగాల్ 2) ఒడిశా
    3) మహారాష్ట్ర 4) కేరళ
26. కింది వాటిలో సరికానిది ఏది?
    1) మెరీనా బీచ్ – తమిళనాడు
    2) మైపాడు బీచ్ – ఆంధ్రప్రదేశ్
    3) కోవలం బీచ్ – మహారాష్ట్ర
    4) గంగాసాగర్ బీచ్ – పశ్చిమ బెంగాల్
27. దేశంలోని బీచ్‌లు, అవి ఉన్న రాష్ట్రాలను జతపరచండి.
    i) అర్జున a) కేరళ
    ii) చెరాయ్ b) గోవా
    iii) శంకరపూర్ c) గుజరాత్
    iv) గోపినాథ్ d) పశ్చిమ బెంగాల్
    1) i-c, ii-d, iii-b, iv-a
    2) i-d, ii-a, iii-b, iv-c
    3) i-c, ii-a, iii-d, iv-b
    4) i-b, ii-a, iii-d, iv-c
28. దిగా బీచ్ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) గోవా
    3) పశ్చిమ బెంగాల్ 4) కర్ణాటక
29. 'జహు' బీచ్ ఏ రాష్ట్రానికి చెందింది?
    1) మహారాష్ట్ర 2) గుజరాత్
    3) ఒడిశా 4) పశ్చిమ బెంగాల్
30. 'బారెన్' అగ్ని పర్వతం ఎక్కడ ఉంది?
    1) అండమాన్ దీవులు
    2) నికోబార్ దీవులు
    3) లక్షదీవులు 4) మాల్దీవులు
31. 'రాస్' దీవి ఎక్కడ ఉంది?
    1) గంగా డెల్టా 2) లక్షదీవులు
    3) అండమాన్ దీవులు
    4) ముంబైకి దక్షిణంగా
32. 'వీలర్ ఐలాండ్' ఏ రాష్ట్రానికి చెందింది?
    1) తమిళనాడు 2) కేరళ
    3) ఒడిశా 4) పశ్చిమ బెంగాల్
33. కింది వాటిలో ఏ దీవులను మొదటిసారిగా సూర్యకిరణాలు తాకుతాయి?
    1) సుహేళి దీవులు 2) మినికాయ్ దీవి
    3) కమోటా దీవి 4) కచ్చల్ దీవులు
34. మహారాష్ట్రలోని తీర ప్రాంతాన్ని ఏమని పిలుస్తారు?
    1) కొంకణ్‌తీరం 2) కెనరాతీరం
    3) మలబార్ తీరం
    4) కోరమాండల్ తీరం
35. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) కెనరాతీరం – కర్ణాటక
    2) మలబార్ తీరం – కేరళ
    3) ఉత్కల్‌తీరం – పశ్చిమ బెంగాల్
    4) సర్కార్‌తీరం – ఆంధ్రప్రదేశ్
36. 'వంగ తీరం' అని ఏ రాష్ట్ర తీర ప్రాంతాన్ని పిలుస్తారు?
    1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
    3) గోవా 4) తమిళనాడు
37. తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్ తర్వాత అత్యధిక తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
    1) పశ్చిమ బెంగాల్ 2) ఒడిశా
    3) తమిళనాడు 4) పుదుచ్చేరి
38. కింది వాటిలో సరైన జత ఏది?
    1) కళింగ తీరం – ఒడిశా
    2) కోరమాండల్ తీరం – తమిళనాడు
    3) రాణా ఆఫ్ కచ్ తీరం – గుజరాత్
    4) పైవన్నీ సరైనవే
39. 'ఉత్కళ్' తీర మైదానం అని ఏ రాష్ట్ర తీరాన్ని పిలుస్తారు?
    1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
    3) ఆంధ్రప్రదేశ్ 4) తమిళనాడు
40. దేశంలో ఎన్ని రాష్ట్రాలు తీర ప్రాంతాన్ని కలిగి ఉన్నాయి?
    1) 8 2) 9 3) 10 4) 11
41. దేశంలో అత్యధిక తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
    1) ఆంధ్రప్రదేశ్ 2) తమిళనాడు
    3) మహారాష్ట్ర 4) గుజరాత్
42. దేశంలో అతి తక్కువ తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
    1) కర్ణాటక 2) కేరళ
    3) గోవా 4) పశ్చిమ బెంగాల్
43. మనదేశంలో 'లాగూన్'లు అత్యధికంగా ఉన్న రాష్ట్రం ఏది?
    1) గుజరాత్ 2) మహారాష్ట్ర
    3) పశ్చిమ బెంగాల్ 4) కేరళ
44. 'ఆలివ్ రిడ్లే' తాబేళ్లకు ప్రసిద్ధి చెందిన చిలక సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఒడిశా 2) తమిళనాడు
    3) కేరళ 4) గోవా
45. 'సరస్సుల నగరం' అని దేన్ని పిలుస్తారు?
    1) శ్రీనగర్ 2) ఉదయ్‌పూర్
    3) జైపూర్ 4) అజ్మీర్
46. భారతదేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
    1) సాంబర్ 2) దాల్
    3) లూనార్ 4) ఊలార్
47. భారత్‌లో అతి పొడవైన ఉప్పునీటి సరస్సు ఏది?
    1) సాంబార్ 2) చిలకా
    3) పులికాట్ 4) పుష్కర్
48. లక్షదీవుల్లో దక్షిణంగా ఉన్న దీవి?
    1) రాస్ 2) సుహేళి
    3) పిట్లీ 4) మినికాయ్
49. న్యూమూర్ దీవులు ఏ రెండు దేశాల మధ్య వివాదస్పదమైనవి?
    1) భారత్, మయన్మార్
    2) భారత్, మాల్దీవులు
    3) భారత్, బంగ్లాదేశ్
    4) భారత్, శ్రీలంక
50. భారతదేశ ప్రాదేశిక జలాల పరిధి ఎంత?
    1) 12 నాటికల్ మైళ్లు
    2) 120 నాటికల్ మైళ్లు
    3) 200 నాటికల్ మైళ్లు 4) 12 కి.మీ.
51. భారతదేశ దక్షిణాగ్ర ప్రాంతమైన 'పిగ్మోలియన్ పాయింట్' లేదా 'ఇందిరా పాయింట్' ఎక్కడ ఉంది?
    1) ఉత్తర అండమాన్ దీవులు
    2) లిటిల్ అండమాన్ దీవులు
    3) గ్రేట్ నికోబార్ దీవులు
    4) లక్షదీవులు
52. అండమాన్ నికోబార్ దీవుల రాజధాని 'పోర్టు బ్లెయిర్' ఏ ప్రాంతంలో ఉంది?
    1) ఉత్తర అండమాన్
    2) మధ్య అండమాన్
    3) దక్షిణ అండమాన్
    4) కార్ నికోబార్
53. భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న భారతదేశ దీవి ఏది?
    1) గ్రేట్ నికోబార్ 2) కార్ నికోబార్
    3) దక్షిణ అండమాన్
    4) మధ్య అండమాన్
54. 'నార్కొండం' అగ్ని పర్వతం ఎక్కడ ఉంది?
    1) మినికాయ్ దీవులు 2) లక్షదీవులు
    3) ఉత్తర అండమాన్ 4) గ్రేట్ నికోబార్

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 2	5) 4
6) 3	7) 2	8) 1	9) 4	10) 4
11) 2	12) 2	13) 3	14) 3	15) 3
16) 2	17) 1	18) 3	19) 4	20) 2
21) 3	22) 2	23) 2	24) 3	25) 2
26) 3	27) 4	28) 3	29) 1	30) 1
31) 3	32) 3	33) 4	34) 1	35) 3
36) 2	37) 3	38) 4	39) 1	40) 2
41) 4	42) 3	43) 4	44) 1	45) 2
46) 4	47) 2	48) 4	49) 3	50) 1
51) 3	52) 3	53) 1	54) 3	

What price should the dealer..



N. Vinaykumar Reddy
Director, IACE,
Hyderabad.

Model Questions

Directions (Q.No.1-5): Data related to the number of visitors in two museums (A&B) during 4 day's.

Days	Museum A		Museum B	
	Number of visitors (male+female)	% of male visitors out of the number of visitors	Number of visitors (male+ female)	% of male visitors out of the number of visitors
Monday	190	30%	480	40%
Tuesday	280	40%	188	50%
Wednesday	350	60%	200	60%
Thursday	400	35%	120	75%

1. In Museum A, on Wednesday 30% of male visitors and 70% of female visitors were from school X. What was the number of visitors (male + female) in Museum A from school X on Wednesday?
a) 161 b) 183 c) 181
d) 153 e) 157

2. The number of visitors (male + female) in Museum A and B increased by 50% and 15% respectively from Thursday to Saturday. If the total number of female visitors in Museum A and B together was equal on Thursday and Saturday, what was the total number of male visitors in Museum A and B together on Saturday?
a) 458 b) 438 c) 442
d) 448 e) 452

3. In Museum B, the ratio of female visitors on Tuesday to Friday was 2:3. If female visitors constituted 50% of the number of visitors (male+female) on Friday, what was the number of visitors (male + female) to Museum B on Friday?
a) 288 b) 296 c) 294
d) 282 e) 276

4. In Museum A, what is the difference between the total number of male visitors on Monday and Tuesday together and that on Wednesday and Thursday together?
a) 183
b) 177
c) 185
d) 187
e) 181

5. What is the average number of male visitors in Museum B on Monday, Wednesday and Thursday?
a) 134 b) 188 c) 185
d) 175 e) 184

Directions (Q.No. 6-10): In each of the following questions two equations I and II are given. You have to solve both the equations and Give answer.
a) If $x > y$ b) If $x \le y$
c) If $x < y$ d) If $x \ge y$
e) $x = y$ or relationship between x and y cannot be established

6. I. $14x^2 + 29x - 18 = 0$
II. $8y^2 - 25y - 28 = 0$

7. I. $6x^2 + 23x - 35 = 0$
II. $7y^2 - 9y - 46 = 0$

8. I. $x^2 = 6889$
$y = \sqrt{7142 - 253}$


IBPS RRB Special
Quantitative Aptitude

9. I. $6x - 11y = 132$
II. $8x + 9y = 34$


10. I. $6x^2 - 21x + 18 = 0$
II. $7y^2 - 46y - 21 = 0$

Directions (Q.No. 11 - 15): Study the following pie-charts carefully to answer the questions.

The following pie-charts show the regional distribution of aid from DAC member.



Year 2011



Year 2016

11. If the total aid received by all the countries in 2011 and 2016 was Rs. 740 billion and Rs. 1150 billion respectively, then which group of region show the maximum difference between 2016 and 2011?
a) South and Central Asia
b) Unspecified c) Europe
d) South of Sahara
e) Latin America and Caribbean

12. The aids received by South and Central Asia in 2011 and by South of Sahara in 2016 are Rs. 192.4 billion and Rs. 552 billion respectively. What is the difference between the total aid received by them in 2016 and that in 2011? (in Rs. billion)
a) 780 b) 820
c) 815 d) 860
e) 845

13. If Europe gets Rs. 74 billion aid in 2011, then the amount of aid received by South and Central Asia and East Asia and Pacific together is how much percentage less than that by South of Sahara and Middle East and North Africa together in the same year?
a) 31.12% b) 39.82%
c) 24.28% d) 34.28%
e) 36.78%

14. If the ratio of aids received by Unspecified region in 2011 to that in 2016 is 22 : 23 and the Unspecified regions get Rs. 264.5 billion in 2016 then what is the ratio of the aids received by Latin America and Caribbean in 2011 to that in 2016?
a) 1687 : 4025 b) 1683 : 4031
c) 4031 : 1683 d) 4025 : 1686
e) None of these

15. If Middle East and North Africa get Rs. 148 billion in 2011, then the aids received by Unspecified regions is what percent more than that received by South of Sahara?
a) 33.33% b) 23.33%
c) 16.66% d) 24.68%
e) None of these

Directions (Q.No.16-20): What value should come in place of question mark (?) in the following questions?

16. $8.6 \times 4.5 \times 30.2 = ?$
a) 1168.74 b) 1248.24
c) 1186.74 d) 1824.14
e) None of these

17. $\frac{17}{9}$ of 1638 of $\frac{19}{7}$ of $\frac{27}{13} = ?$
a) 12442 b) 18462
c) 19628 d) 17442
e) None of these

18. 25897 − 2434 + 3246 − 2642 = 7456 + ?
a) 26421 b) 15211
c) 16611 d) 14211
e) None of these

19. $23^{2.3} \times 23^{2.6} \times 23^{475.2} = 23^{345+?}$
a) 126.1 b) 135.1
c) 145.1 d) 129.1
e) None of these

20. $7\frac{2}{3} + 8\frac{7}{9} + 2\frac{8}{9} + 4\frac{7}{12} = ?$
a) $39\frac{5}{12}$ b) $26\frac{7}{12}$ c) $23\frac{11}{12}$
d) $40\frac{7}{12}$ e) None of these

Key & Solutions

1. Number of (male + female) visitors in Museum A from School X on Wednesday
$= 350 \times \frac{60}{100} \times \frac{30}{100} + 350 \times \frac{40}{100} \times \frac{70}{100}$
= 63 + 98 = 161 ***Ans: a***

2. Total number of visitors in Museum A on Saturday
$= 400 \times \frac{150}{100} = 600$
Total number of visitors in Museum B on Saturday
$= 120 \times \frac{115}{100} = 138$
Now, total number of female visitors in Museum A and B together on Thursday
$= \left(400 \times \frac{65}{100} + 120 \times \frac{25}{100}\right) = 290$
∴Total number of male visitors in Museum A and B together on Saturday = (600 + 138) − 290
= 738 − 290 = 448 ***Ans: d***

3. Number of female visitors on Friday in Museum B = 50% of
$188 \times \frac{3}{2} = \frac{1}{2} \times 188 \times \frac{3}{2} = 47 \times 3 = 141$
Number of (male + female) visitors in Museum B on Friday
∴50% ⇒ 141
∴100% ⇒141×2=282 ***Ans: d***

4. Required difference = (60% of 350 + 35% of 400) − (30% of 190 + 40% of 280) = (210 + 140) − (57 + 112) = 181 ***Ans: e***

5. Required average
$= \frac{40\% \text{ of } 480 + 60\% \text{ of } 200 + 75\% \text{ of } 120}{3}$
$= \frac{192 + 120 + 90}{3} = \frac{402}{3} = 134$
Ans: a

6. $14x^2 - 7x + 36x - 18 = 0$
$(2x-1)(7x + 18) = 0$
$x = \frac{1}{2}, \frac{-18}{7}$
$8y^2 + 32y - 7y - 28 = 0$
$(y + 4)(8y - 7) = 0$
$y = -4, \frac{7}{8}$
Hence relation cannot be established ***Ans: e***

7. $6x^2 + 30x - 7x - 35 = 0$
$(x + 5)(6x - 7) = 0$
$x = -5, \frac{7}{6}$
$7y^2 + 14y - 23y - 46 = 0$
$(y + 2)(7y - 23) = 0$
$y = -2, \frac{23}{7}$
Hence, relation cannot be established ***Ans: e***

8. I. $x^2 = 6889$
$\therefore x = \sqrt{6889} = \pm 83$
II. $y = \sqrt{7142 - 253} = \sqrt{6889} = 83$
Hence $x \le y$ ***Ans: b***

9. I. $6x - 11y = 132$ ——— (i)
II. $8x + 9y = 34$ ——— (ii)
Equation (i) × 4 − (ii) × 3 gives
$24x - 44y = 528$
$24x + 27y = 102$
$-71y = 426$ $\therefore y = -6$
Putting the value of y in equation (i), we get $x = 11$
Hence, $x > y$. ***Ans: a***

10. I. $2x^2 - 4x - 3x + 6 = 0$
$(x - 2)(2x - 3) = 0$
$x = 2, \frac{3}{2}$
$7y^2 - 49y + 3y - 21 = 0$
$(y - 7)(7y + 3) = 0$
$y = 7, \frac{-3}{7}$
Hence, relation can't be established ***Ans: e***

11.

Country	2016	2011	Difference
Latin America & caribbean	11.50× 14 = 161	7.4× 8 = 59.2	101.8
Middle East & North Africa	11.50 × 8 = 92	7.4×10 =74	18
Europe	11.50 × 10 = 115	7.4 × 4 =29.6	85.4
Unspecified	11.50 × 23 =264.5	7.4 × 30 =222	42.5
South of Sahara	11.50 × 24 = 276	7.4 × 25 =185	91
South and Central Asia	11.50 × 15 = 172.5	7.4 × 13 96.2	76.3

Hence the maximum difference is Rs. 101.8 billion ***Ans: e***

12. Required difference
$= \frac{552}{24} \times 100 - \frac{192.4}{13} \times 100 = \text{Rs. } 820$
Ans: b

13. Required % =
$= \frac{(25 + 10) - (13 + 10)}{(25 + 10)} \times 100$
$= \frac{35 - 23}{35} \times 100 = 34.28\%$
Ans: d

14. The aids received by Unspecified region in 2011 = Rs. 253 billion
Required Ratio
$= \frac{\frac{253}{30} \times 8}{\frac{264.5}{23} \times 14} \Rightarrow \frac{67.47}{161}$
$\Rightarrow \frac{1686.75}{4025} \Rightarrow \frac{1687}{4025}$ ***Ans: a***

15. $\text{Req.}\% = \frac{30 - 25}{25} \times 100 = 20\%$ ***Ans: e***

16. 8.6 × 4.5 × 30.2 = 1168.74
Ans: a

17. $\frac{17}{9} \times 1638 \times \frac{19}{7} \times \frac{27}{13} = 17442$ ***Ans: d***

18. 25897 − 2434 + 3246 − 2642 = 7456 + ? Or, ? = 24067 − 7456 = 16611 ***Ans: c***

19. 345 + ? = 2.3 + 2.6 + 475.2
? = 135.1 ***Ans: b***

20. $? = (7 + 8 + 2 + 4)\left(\frac{2}{3} + \frac{7}{9} + \frac{8}{9} + \frac{7}{12}\right)$
$= 21 + \left(\frac{24 + 28 + 32 + 21}{36}\right) = 23\frac{11}{12}$
Ans: c

సా..గుతున్న హరితహారం

- వారం రోజుల్లో నాటాల్సిన మొక్కలు 52 లక్షలు
- కార్యక్రమానికి దూరంగా ఉంటున్న కూలీలు
- అంటీముట్టనట్లు ప్రజాప్రతినిధులు..


హరితహారంలో మొక్కలు నాటుతున్న కూలీలు

సారంగాపూర్: హరితహారం మూడో విడత కార్యక్రమం జిల్లాలో సా....గుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం గడువు మరో వారం రోజుల్లో ముగియనుంది. ఈమేరకు నిర్దేశించిన మొక్కలు నాటాలి. ఈమేరకు అధికారులు వేసవి నుంచే ప్రణాళికలు రూపొందించినా లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటకపోవడంతో కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో మొక్కలు నాటేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. గత నెల 12న ప్రారంభమైన హరితహారం మూడో విడత కార్యక్రమం ఆగస్టు 31 వరకు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో మొత్తం 1.35 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇప్పటి వరకు 83 లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు. జూలై నెలలో వేగంగా సాగినా మొక్కలు నాటే కార్యక్రమం ప్రస్తుతం పూర్తిగా మందగించింది. కూలీలకు మూడు నెలలుగా డబ్బులు అందకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కూలీల భాగస్వామ్యం తగ్గిపోవడంపై ఉన్నతాధికారులు అన్ని మండలాల నుంచి నివేదికలు తెప్పించుకున్నట్లు తెలిసింది. జిల్లాలో జూన్ నుంచి 21,401 జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్నారు. వీరికి జూన్, జులై, ఆగస్టు మాసాల పనులకు సంబంధించి రూ.17.63 కోట్లు చెల్లించాల్సి ఉంది. హరితహారం ప్రారంభమైన తర్వాత హరితహారంలో నాటిన మొక్కలు, గుంతలు తీసిన డబ్బులు చెల్లింపులు జరగకపోవడంతో కూలీలు పనులపై నిర్లిప్తత వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులూ అంతంతమాత్రమే

హరితహారం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మొదట హుషారుగా పాల్గొన్నా, ప్రస్తుతం వీరి భాగస్వామ్యం అంతంతమాత్రంగానే ఉంది. ప్రతీ బుధవారం కలెక్టర్ గ్రీన్‌డే నిర్వహించి మొక్కలు నాటడం, వాటికి నీరు అందించే కార్యక్రమం నిర్వహించాలని దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావలని పేర్కొన్నా సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనితోపాటు మొక్కలను పెంచాలని ప్రోత్సహించే చర్యలను కూడా ప్రజాప్రతినిధులు చేపట్టకపోవడం గమనార్హం.

మండలాల వారీగా కూలీలు, బకాయిలు

మండలం	కూలీలు	బకాయిలు(రూ.లలో)
ధర్మపురి	1293	రూ.1.79 కోట్లు
గొల్లపల్లి	1605	రూ.1.05 కోట్లు
ఇబ్రహీంపట్నం	1326	రూ.1.43 కోట్లు
జగిత్యాల	1714	రూ.84 లక్షలు
కథలాపూర్	1005	రూ.81 లక్షలు
కొడిమ్యాల	834	రూ.1.23 కోట్లు
కోరుట్ల	1332	రూ.89 లక్షలు
మల్లాపూర్	1320	రూ.78 లక్షలు
మల్యాల	1394	రూ.65 లక్షలు
మేడిపల్లి	1686	రూ.1.34 కోట్లు
మెట్‌పల్లి	997	1.35 కోట్లు
పెగడపల్లి	1470	రూ.1.49 కోట్లు
రాయికల్	1994	రూ.1.10 కోట్లు
సారంగాపూర్, బీర్‌పూర్	1858	రూ.1.29 కోట్లు
వెల్గటూర్	1573	రూ.1.55 కోట్లు

జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిగా నదీముల్లాఖాన్


నదీముల్లాఖాన్

సాక్షి, జగిత్యాల: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి (డీఎండబ్ల్యూవో)గా నదీముల్లాఖాన్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆదిలాబాద్ డీఎండబ్ల్యూవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను జగిత్యాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిగా పని చేసిన రాంచంద్రారెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 31న ఉద్యోగ విరమణ పొందారు. ప్రభుత్వం ఆ పోస్టును భర్తీ చేయకపోవడంతో కలెక్టర్ శరత్.. డీఎండబ్ల్యూవోగా జగిత్యాల ఆర్డీవో గంటా నరేందర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇదే క్రమంలో నాలుగు నెలల కాలంలో జిల్లాలో మైనార్టీ గురుకులాల ఏర్పాటు కావడం.. హరితహారం అమలు వంటి కీలక కార్యక్రమాలలో ఆ కార్యాలయ సూపరింటెండెంట్ ముహమ్మద్ మహమూద్ అలీ అఫ్సర్.. సీనియర్ అసిస్టెంట్ ఫసీఉల్‌ఆబిదీన్.. జూనియర్ అసిస్టెంట్ ధరణి నరేందర్‌కు వెన్నుదున్నగా నిలిచి శాఖాపర ప్రగతిలో కీలకపాత్ర పోషించారు. ఇదీలావుంటే.. నదీముల్లాఖాన్ డీఎండబ్ల్యూవోగా పని చేసేందుకు ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఒకవేళ ఆయన బాధ్యతలు చేపట్టకపోతే డాక్టర్ నరేందర్ కొనసాగనున్నారు.

నాచుపల్లిలో కులాంతర వివాహం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి గ్రామనికి చెందిన గాలిపెల్లి శ్రీకాంత్(పద్మశాలి), కై ర అనూష (గౌడ) చాలాకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవలే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. వారి అంగీకారంతో గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పెళ్లి చేసుకున్నారు. ఈ వివాహానికి సర్పంచ్ పిట్టల మాధవి, సింగిల్ విండో వైస్ చైర్మెన్ తాళ్లపెల్లి అంజయ్య గౌడ్, కుల పెద్దలు, వధూవరుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు.

జగిత్యాల కోర్టు ఆవరణలో గాయత్రీ యజ్ఞం


కోర్టు ఆవరణలో నిర్వహించిన గాయత్రీయజ్ఞంలో భక్తులు

జగిత్యాలజోన్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల కోర్టులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆదివారం గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని గాయత్రీ పరివార్ సంఘం సభ్యులు నిర్వహించగా, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య కోరారు. మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి మాజీ సర్పంచులు ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి మాజీ సర్పంచులకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల్లో నియమించాలని, మాజీ సర్పంచ్ చనిపోతే వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థికసాయం చేయాలని, హెల్త్ కార్డు, బస్‌పాస్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ప్రకటించారు. మాజీ సర్పంచుల సంఘం మండల గౌరవధ్యక్షుడిగా కంతి మోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా కమటం రమేశ్, ఉపాధ్యక్షులుగా నల్ల విఠల్, లక్కి డి నర్సక్క, ప్రధాన కార్యదర్శిగా చెట్లపల్లి చం ద్రశేఖర్ గౌడ్, కోశాధికారిగా ఖానాపూర్ నర్సయ్యతోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గీతాసారాన్ని తెలుసుకోవాలి

మెట్‌పల్లి(కోరుట్ల): శాంతికి మార్గం చూపే గీతాసారాన్ని అందరూ చదివి తెలుసుకోవాలని త్రిదండి దేవనాథ రామనుజ జీయర్‌స్వామి సూచించారు. పట్టణంలోని ఖాదీ ప్రతిష్టాన్ అంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సుందర సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గీతలోని సారాంశం హిందూతత్వానికి మూలమన్నారు. సత్సంగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గీత పారాయణం తరగతులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఛత్రపతి, మర్రి భాస్కర్, గోరుమంతుల సురేందర్, పడిగెల వెంకటేశ్, గాదె రమేష్ తదితరులున్నారు.

రైతు సమస్యలపై పోరాడుతాం

- కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ నాయకుడు మనోహర్‌రెడ్డి


మేడిపెల్లిలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

మేడిపెల్లి(వేములవాడ): రైతుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పార్టీ వేములవాడ నియోజకవర్గ నాయకుడు వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి అన్నారు. మేడిపెల్లి పీఎన్‌ఆర్ గార్డెన్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతుల పంట రుణాలు ఇంతవరకు మాఫీ కాలేదని చెప్పారు. మోత్కురావుపేట నుంచి చందుర్తి రోడ్డు పనులను ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. రైతులు, ప్రజాసమస్యలను పాలకులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు నిరంతరం ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మేడిపెల్లి–2 ఎంపీటీసీ దాసరి శంకర్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నల్ల భూమరెడ్డి, ఉపాధ్యక్షులు మాలోతు లచ్చానాయక్, నాయకులు ఏనుగు రమేశ్‌రెడ్డి, సురకంటి శేఖర్‌రెడ్డి, వనపర్తి దేవయ్య, బొమ్మెన ప్రశాంత్, జంగంపెల్లి విజయ్, నర్సారెడ్డి, మరిపెల్లి స్వామిగౌడ్, గోపి, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం'


మాట్లాడుతున్న సాగర్‌రావు

జగిత్యాలటౌన్: టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రైతులంటే పట్టింపు లేదని టీటీడీపీ జిల్లా అధ్యక్షుడు అయిలేని సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకంలో జిల్లాలోని మల్యాల మండలంలోని రాంపూర్, పోతారం గ్రామాల్లోని 32 మంది రైతుల వద్ద నుంచి సాగు భూమి సమీకరణకు కలెక్టర్, ఆర్డీవో, ప్రజాప్రతినిధులందరి సమక్షంలో నిర్వాసితులకు ఎకరాకు రూ.11.50 లక్షలు, పంట నష్టం కింద రూ.1.50 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు అర్ధరాత్రి సంబంధిత రైతులపై ఒత్తిడి తెచ్చి ఎకరాకు లక్ష రూపాలయలు చెల్లించడం మోస పూరిత చర్య అన్నారు. చేతికి వచ్చిన పంట కూడా కనీసం పశుగ్రాసనికి పనికి రాకుండా ప్రొక్లెయిన్‌తో రైతులకు చెప్పకుండా తొలగించడం దారుణమన్నారు. ఇచ్చిన హామీ మేరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహంకాళి రాజన్న, బోగ వెంకటేశ్వర్లు, బాలె శంకర్, అనుమల్ల జయశ్రీ, నవ్వొత్తు రవీందర్, వనమాల నిరంజన్, కొండ శ్రీధర్, అనుమల్ల రఘు, బద్దం కిషన్, రాంపూర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన షాపుల్లో చోరీ


జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలో టౌన్‌హాల్ పక్కన మున్సిపాల్ కాంప్లెక్స్‌లోని రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాదారులు శనివారం రాత్రి రోజు లాగానే తాళం వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం షాపుల తాళాలు పగులగొట్టి ఉండడంతో స్థానికులు యజమానులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి షాపులను పరిశీలించగా మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్‌లో రూ.5 వేలు, ట్రావెల్స్‌లో రూ.2 వేలు ఎత్తుకెళ్లారు. మరో రెండు షాపుల్లోనూ చోరీకి యత్నించిన దొంగలు షట్టర్లు తెరుచుకోకపోవడంతో వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు పక్కా ప్రణాళికతో చోరీ చేసినట్లు తెలుస్తోంది.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజేందర్

వెల్గటూరు: బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా వెల్గటూరు కుచెందిన గంట్యాల రాజేందర్‌ను నియమిస్తూ అధ్యక్షుడు గాజుల నాగరాజు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నాయకులు గాజుల నాగరాజు, ఓరుగంటి భార్గవరాం, చితంల గంగాధర్, బుసర్తి గంగారంకు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు

జగిత్యాల | సోమవారం | ఆగస్టు | 28 | 2017 సాక్షి

విఘ్నేశ్వరుడికి 1,11,116 ఉండ్రాళ్ల నైవేద్యం





గొల్లపల్లి(ధర్మపురి) : మండలకేంద్రంలోని ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి 1,11,116 ఉండ్రాళ్ల నైవేద్యం సమర్పించారు. మహిళలు పూజలు నిర్వహించారు. సంఘం మండల, పట్టణ అధ్యక్షుడు బొల్లం రమేశ్, చాడ వెంకట రమణ, చాడ సత్తయ్య, అనంతుల భూమయ్య, ఎర్ర సంపత్, వెలిచాల బుచ్చయ్య, ఎర్ర మల్లేశ, చాడం, గంప హన్మాండ్లు పాల్గొన్నారు.

దళితులు, బీసీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

- మూడేళ్లుగా మహిళా సంఘాలకు అందని వడ్డీ
- సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి



జాబితాపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: దళితులను, బీసీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. అదివారం మండలంలోని ధరూర్‌లో రూ.6 లక్షలతో నిర్మించిన స్నానఘట్టాలను, జాబితాపూర్‌లో రూ.2 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులను, ధర్మారం గ్రామంలో లక్షతో నిర్మించే యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ కంపౌండ్ వాల్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అధికారంలోకి వస్తే దళితులకు 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పి మాట తప్పారని, దళితులకు స్వయం ఉపాధి యూనిట్ల అమలులోనూ విఫలమయ్యారన్నారు. యూపీఏ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను అమలులోకి తెస్తే, రాష్ట్రంలో వారికి వచ్చిన నిధులను 50 శాతం మాత్రమే ఖర్చు చేశారని, మిగతా 50 శాతం ల్యాప్స్ అయ్యాయన్నారు. గ్రామాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం రూపాయి ఇవ్వడం లేదని దీంతో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వం తెచ్చిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. గతంలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందాయని, ప్రస్తుత ప్రభుత్వంలో మూడేళ్లుగా వడ్డీ నిధులు విడుదల కాలేదని దీంతో పేద మహిళలంతా వారు తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించడం భారంగా మారిందని చెప్పారు. దివంగత రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉండగా గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు 73,74 రాజ్యాంగ సవరణలు చేపట్టి నేరుగా గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేసి, గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. ఎంపీపీ మానస, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గంగం మహేశ్, సర్పంచ్‌లు కొలుగూరి జలజ, నీలం లక్ష్మి, యాగండ్ల మల్లేశం, ఎంపీటీసీలు శీలం సురేందర్, శ్రీరాముల గంగాధర్, నాయకులు కొలుగూరి దామోదర్‌రావు, మారు గంగారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా గోపాలకాలువలు



బీర్‌పూర్(జగిత్యాల): మండలంలోని కొల్వాయిలో ఆదివారం గోపాలకాలువలు కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు శనివారం రాత్రంతా ఉపవాసాలతో భజనలు చేశారు. ఆదివారం గ్రామంలోని యువకులు శ్రీకృష్ణుడు, గొల్లభామల వేషాలు ధరించి హనుమాన్ ఆలయం ఎదుట నాటిన చెట్లచుట్టూ తిరుగుతూ, పాటలు పాడుతూ నృత్యం చేశారు. అనంతరం ఉట్టి స్తంభం ఎక్కి ఉట్టి పగులగొట్టి, మజ్జిగను, పండ్లను భక్తులకు కానుకగా విసిరేశాడు. కార్యక్రమంలో సర్పంచ్ రంగు సులోచన, ఎంపీటీసీ చెట్ల జల, విండో చైర్మన్ పాత రమేశ్, ఉపసర్పంచ్ నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్ రాంచందర్‌రావు, వేషణదారులు లక్ష్మణ్,రాజు, లచ్చయ్య పాల్గొన్నారు.

అండర్-19 క్రీడల విజేతలు వీరే...

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో మినీ స్టేడియంలో అండర్–19 జూనియర్ కళాశాలల క్రీడల్లో జగిత్యాల, పెద్దపెల్లి జిల్లాల కళాశాలలకు చెందిన వివిధ మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్ బాలికల విభాగంలో జగిత్యాలకు చెందిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల ప్రథమ స్థానం, నందిమేడారానికి చెందిన టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ జూనియర్ కళాశాల క్రీడాకారులు ద్వితీయ స్థానం సాధించారు. వాలీబాల్ బాలుర విభాగంలో గొల్లపల్లికి చెందిన సిద్దార్థ జూనియర్ కళాశాల ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, రాయికల్‌కు చెందిన శ్రీనిధి జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సొంతం చేసుకున్నారు. హాండ్‌బాల్ బాలికల విభాగంలో ధర్మారం మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం, ధర్మారానికి చెందిన సాధన జూనియర్ కళాశాలకు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో మంథని టీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలకు ప్రథమ, మేడిపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలకు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. టెన్నికాయిట్ బాలుర విభాగంలో ఎం. వంశీ, ఎల్. గణేశ్, జే.విజయ్‌కుమార్, జే.ప్రశాంత్, బాలికల విభాగంలో వీ.ఇంద్రజ, ఎస్.మాధురి దీక్షిత్, ఎన్.అనూశ, పీ.అర్చన, బీ.సౌజన్య గెలుపొందారు. కార్యక్రమానికి విశిష్ట అధికారిగా ఎల్. సుహాసిని, పీడీలు హరిరామ్, ఆనంద్, రవి, వెంకటేశ్, గౌతమ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ధర్మపురివాసికి తెలంగాణ రత్న



నాగరాజు అంజయ్య

ధర్మపురి: ఆయుర్వేద వనమూలికల రంగంలో విశేష సేవలందించిన ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ నాగరాజు అంజయ్యకు తెలంగాణ రత్న అవార్డు వరించింది. ధర్మపురికి చెందిన అంజయ్య వంశపారంపర్యంగా వస్తున్న ఆయుర్వేద వనమూలిక రంగంలో 40 ఏళ్ల నుంచి వేలాది మందికి ఉచిత వైద్య సేవలందించారు. ఆయన సేవలను హైదరాబాద్‌కు చెందిన అర్పిత సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ వారు గుర్తించి 2017కి తెలంగాణ రత్న అవార్డుకు ఎంపిక చేశారు. ఎంపికపై మిమిక్రీ అవార్డు గ్రహిత జి.ప్రేమ్‌కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగరాజు మనోహర్, ఆర్‌ఎంపీ, పీఎంపీలు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



రవీంద్ర యూత్ గణపతి మంటపం వద్ద హోమం చేస్తున్న భక్తులు

కోరుట్లటౌన్: పట్టణంలోని రవీంద్ర యూత్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ శీలం వేణు, కౌన్సిలర్ చింతకింది లావణ్య రాంప్రసాద్ అన్నదానం చేశారు.

మెడికల్ కళాశాల కోసం గ్రామస్థాయిలో పోరాడాలి

జగిత్యాల టౌన్: మెడికల్ కళాశాలకోసం గ్రామస్థాయిలో పోరాడాలని పంచాయతీ రాజ్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం కిషన్‌రెడ్డి, టీబీసీ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం టీఎన్జీవో సంఘం భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కుల సంఘాలు తీర్మానాలు చేసి, గ్రామస్థాయి నుంచి పోరాడాలన్నారు. జిల్లాలోని 327 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, కుల సంఘాల నాయకులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పేద విద్యార్థులకు వైద్యవిద్య అందుబాటులో ఉండేందుకు, జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలన్నారు.



పెగపడల్లి: మండలంలోని ఏడుమోటలపల్లి తండాలో నిర్మించ తలపెట్టిన అంగన్‌వాడీ ఖభవనం అర్ధాంతరంగా నిలిచిపోయింది. భవన నిర్మాణానికి అవసరమ్యే నిధులు మంజూరుకు అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే నిధులు మంజూరు చేసి భవనం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346643

నూతన శోభ

- పెగడపల్లిలో కొత్త భవనాల నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు

పెగడపల్లి: నూతనంగా నిర్మించిన భవనాలతో పెగడపల్లి కొత్త శోభ సంతరించుకుంది. మండల కేంద్రంలో నూతనంగా సహకార బ్యాంకు, సంఘ భవనం, వ్యవసాయ మర్కెట్లో గోడౌన్ నిర్మించారు. వీటిని సోమవారం రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించేందుకు నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానికంగా ఉన్న ప్రాథమిక సహకార సంఘం శిథిలమైన భవనంలో కొనసాగుతుండటంతో సిబ్బంది, పాలకవర్గం ఇబ్బందులు పడుతుండేది. దీంతో సంఘం చైర్మన్ ఓరుగంటి రమణారావు ప్రత్యేక చొరవ చూపడంతో నూతన భవనం నిర్మించారు. సుమారు రూ. 50 లక్షల వ్యయంతో ఆధునిక హంగులతో రెండంతస్తులతో కూడిన సహకార బ్యాంకు, సంఘం భవనం నిర్మించారు. ఇందులో ఏటీఎం సేవలు కూడా కల్పిస్తున్నారు. అంతే కాకుండా పాత భవనాన్ని తొలగించి దాని స్థానంలో ఎరువుల నిల్వ కోసం గోదాం, ప్రస్తుతం సంఘం ఆవరణ ముందు భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో దుకాణ సముదాయాలను నిర్మించనున్నట్లు రమణారావు తెలిపారు.



వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన గోదాం

నెరవేరిన కల

పెగడపల్లిలో ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్న ప్రజల కల ఎట్టకేలకు ఫలించింది. ఇంత వరకు పెగడపల్లిలో సబ్ మార్కెట్ ఏర్పాటు చేసి గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానం చేశారు. ఇక్కడ మార్కెట్ పరంగా ఎలాంటి కార్యకలాపాలు జరిగేవి కావు. ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ చొరవ చూపి పెగడపల్లిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయించారు. రైతుల అవసరాల దృష్ట్యా నాబార్డు నిధులు రూ.1.5 కోట్లతో 2.500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గౌడౌన్ నిర్మించారు. మార్కెట్ కార్యాలయం నిర్మించి ఈ ఖరీఫ్ నుంచి ధాన్యం కొనుగోళ్లు జరుపుతామని చైర్మన్ రాజేశ్వర్ రావు తెలిపారు.

రైతు సేవకు కృషి



సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు సేవలను మరింత విస్తృత పరిచేందుకు కృషి చేస్తున్నా. దీనిలో భాగంగా సహకార బ్యాంకు ఏర్పాటు చేశాం. సంఘం అభివృద్ధికి రైతులు, సభ్యులు సహకరించాలి.

-వోరుగంటి రమణారావు

రైతుల సౌకర్యార్థం



రైతుల సౌకర్యార్థం మార్కెట్‌లో గోడౌన్ నిర్మించాం. ధాన్యం నిల్వ చేసుకునేందుకు స్థలం లేక తక్కువ ధరకే ధాన్యం విక్రయిస్తున్నారు. గోదాం నిర్మాణంతో నిల్వ చేసుకొని ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు.

-కోరుకంటి రాజేశ్వర్‌రావు

న్యూస్ బాక్స్

నేడు మంత్రి హరీశ్‌రావు రాక

పెగడపల్లి: పెగడపల్లికి సోమవారం భారీ నీటి పారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు, సహకార సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు తెలిపారు. పలు అభివృద్ధి పనులను ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఆయన ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రి పర్యటన వివరాలను విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, రూ.18 కోట్లతో చేపట్టే డబుల్ రోడ్డు నిర్మాణ పనులు, రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించిన సహకార బ్యాంకు భవనం ప్రారంభిస్తారని వివరించారు. అనంతరం సహకార సంఘం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతారన్నారు. రూ. 1.50 కోట్లతో నిర్మించిన గోదాంను ఆయన ప్రారంభిస్తారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను జగిత్యాల డీఎస్పీ కరుణాకర్ ఆదివారం పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై సీఐ కృపాకర్, ఎస్సై వెంకట్‌రెడ్డిలతో చర్చించారు.

కొనసాగుతున్న రెవెన్యూ సర్వే

పెగడపల్లి: భూ రికార్డుల శుద్ధీకరణలో భాగంగా రెవెన్యూ రికార్డుల సవరణ కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో వీఆర్వోలు ఇంటింటా సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సర్వేలో భాగంగా రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకంలోని వివరాలు వీఆర్వోలు వద్ద ఉన్న రికార్డుల్లో ఉన్నాయో?లేవో సరి చూసుకోవాలని సూచించారు. ప్రతి రైతును కలిసి వివరాలు సేకరిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్లో సైక్లింగ్ పోటీలు

ధర్మపురి: మండలంలోని బూర్గుపల్లెలో ఆదివారం స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. టీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కంది తిరుపతి ఆధ్వర్యంలో బూర్గుపల్లె రోడ్డు నుంచి హన్మాన్ విగ్రహం వరకు పోటీలను నిర్వహించారు. మొత్తం 25 మంది పోటీలో పాల్గొన్నారు. విజేతకు 500 రూపాయలను బహుమతిగా అందజేశారు.

మంత్రుల సభకు తరలిరావాలి

ధర్మపురి: ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రుల సభను విజయవంతం చేయాలని దేవస్థానం చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాదినేని రాజేందర్ కోరారు. ధర్మపురిలోని హరిత భవన్‌లో ఆదివారం నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని రాయపట్నం, తిమ్మాపూర్, రాజారం, జైనా, దొంతాపూర్ గ్రామాల్లో రూ.71 కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాలను నేడు మంత్రి హరీశ్‌రావు, ఈటల రాజేందర్, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ ప్రారంభించనున్నారు. రాయపట్నంలో పథకాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు రైతులనుద్దేశించి మాట్లాడుతారని చెప్పారు. పెగడపల్లి మండలంలో చేపట్టిన కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని మధ్యాహ్నం 3 గంటలకు ధర్మపురికి చేరుకుంటారని వివరించారు.



మాట్లాడుతున్న నాయకులు

దేవాలయాల్లో పూజలు

ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవం అనంతరం సాయంత్రం మంత్రులు, చీఫ్‌విప్ ఈశ్వర్ ధర్మపురి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వైస్ ఎంపీపీ అయ్యోరి రాజేశ్, జైనా పీఏసీఎస్ చైర్మన్ నరేశ్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పులిశెట్టి మల్లేశం, భరతపు మంజుల, నాయకులు సంగి శేఖర్, ఇందారపు రామయ్య, స్తంభంకాడి మహేశ్, అప్పాల వసంత్, గుండయ్య, బాల్‌రాజు ఉన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ధర్మపురి: ఏళ్ల నుంచి డ్రెయినేజీ లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు మోక్షం లభించింది. ధర్మపురి పట్టణంలో నందీ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు డ్రెయినేజీ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.3 లక్షల పంచాయతీ నిధులతో ఆదివారం పనులు ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ సత్తమ్మ కోరారు.

వెండితెర



లై: శ్రీనివాస (జగిత్యాల– 221333) 11.30, 2.30,6.00,9.00
ఫిదా: బాలాజీ (జగిత్యాల– 2212 65) 11.00, 2.00, 6.00, 9.00
దర్శకుడు: నటరాజ్(జగిత్యాల) 11.00, 2.00, 6.00, 9.00
నేనే రాజు నేనే మంత్రి శ్రీరామ (జగిత్యాల) 11.00, 2.00, 6.00, 9.00
జబ్‌హరీ..మెట్‌సెజల్: దుర్గరాజా కళామందిర్ (జగిత్యాల) 11.30, 2.30, 6.30,9.30

దండాలయ్య.. ఉండ్రాళ్లయ్య





గొల్లపల్లి: మండలంలోని చెందోళి, గొల్లపల్లి గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టిగణపతి, హరితహారం గణపతులను ప్రతిష్ఠించి ప్రత్యేకతను చాటారు. మండలంలోని చెందోళిలో దొనకొండ సత్యం అనే ప్రయివేట్ ఉపాధ్యాయుడు మట్టి గణపతి తయారు చేసి ప్రతిష్ఠించాడు. గొల్లపల్లిలో యువ సబర్మతి యూత్ ఆధ్వర్యంలో కొమ్ము శ్రీనివాస్ హరితహారం, మట్టిగణపతి ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు.


Zone Guide

నియామకం



వెల్గటూరు: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కప్పారావుపేట గ్రామానికి చెందిన మంచాల ఓదెలును నియమించినట్లు అధ్యక్షుడు తిరుమల్ ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ప్రధానకార్యదర్శి పదవిని కట్టబెట్టిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు బాజోజి భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజయ్యకు ఓదెలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణి



పెగడపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 నుంచి ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ లక్ష్మారెడ్డి తెలిపారు.

పరిశీలన



పెగడపల్లి: మండలంలోని నామాపూర్‌లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన వైకుంఠదామం పనులు పరిశీలిస్తామని ఎంపీడీవో దివ్యదర్శన్ రావు తెలిపారు.

ఆరాధన



పెగడపల్లి: స్థానిక శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ తెలిపారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేనా?

- పెరుగుతున్న ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ లెవల్
- నిర్మాణానికి ఆటంకం



కోటిలింగాల మార్గంలో నిర్మిస్తున్న వంతెన

వెల్గటూరు: వెల్గటూరు కోటిలింగాల మధ్య వంతెన నిర్మాణంపై ప్రజల ఆశలు అడియాసలే అయ్యాయి. రెండు నెలలుగా నిర్మిస్తున్న వంతెనపై ప్రజలు పెట్టుకున్న ఆశలు గల్లంతు కాబోతున్నాయి. గోదావరిలో పెరుగుతున్న నీటి మట్టంతో ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పెద్దవాగు ద్వారా వంతెన నిర్మాణం వద్దకు చేరుకున్నాయి. దీంతో పనులు నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఏడాదయినా వంతెన అందుబాటులోకి వస్తుందనుకున్న కోటిలింగాల వాసుల కల కలగానే మిగలనుంది.

ఎండాకాలం వరకు ఆగాల్సిందే..

వెల్గటూరు కోటిలింగాల గ్రామాలను కలుపుతూ లోలెవల్ వంతెన ఉంది. ఇది బ్యాక్ వాటర్‌లో ఆరునెలలపాటు ముంపునకు గురవుతుంది. 2015 పుష్కరాల సమయంలో హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.2.25 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంత త్వరగా వంతెన కట్టలేమని ఆర్‌అండ్‌బీ అధికారులు చేతులెత్తి తాత్కాలిక వంతెన కట్టారు. దాంతో పుష్కరాలు వెళ్లదీశారు. ఆ తర్వాత పనులు ప్రారంభించాల్సిన అధికారులు వంతెన నిర్మాణం జోలికే పోలేదు. సంవత్సరం గడిచింది.. గ్రామస్తులు, యాత్రికులు ఇబ్బందులు పడుతునే ఉన్నారు. ఇప్పుడు నిర్మించకపోతే మళ్లీ ఎండాకాలం వరకు ఆగి, బ్యాక్ వాటర్ పోయాక పూర్తిచేయాల్సి ఉంటోంది.

జూలైలో పనులు ప్రారంభం

జూలైలో వంతెన పనులను ప్రారంభించారు. రెండు నెలు గడిచేటప్పటికే బ్యాక్ వాటర్ వంతెన వద్దకు చేరుకుంది. మరో వారం రోజుల్లో వంతెన నిర్మిస్తున్న ప్రదేశం పూర్తిగా మునిగిపోనుంది. వంతెన నిర్మాణంలో మూడు పిల్లర్లు నిర్మాణం కావాల్సిండగా ఇప్పటికి రెండు మాత్రమే పూర్తిచేశారు. మరో పిల్లర్ వేయడానికి బ్యాక్ వాటర్ అడ్డుగా ఉంది.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

2016 మార్చిలోనే పనులు మొదలు పెట్టాల్సిన అధికారులు 2017 జూన్ వరకు మొదలు పెట్టక పోవటం గమనార్హం. జూన్ వరకు అధికారులు వంతెన డిజైన్ తయారు చేయక పోవటం దీని నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ అధికారుల చిత్తశుద్ధిని తెలియజేస్తోందలి. వంతెన లేకపోవడంతో కోటిలింగాలకు యాత్రికుల సంఖ్య తగ్గుతోంది. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న కోటిలింగాలకు వంతెన నిర్మిస్తే యాత్రికుల తాకిడి పెరుగుతుంది.

పూర్తి చేయాలి

వంతెన నిర్మాణం సత్వరమే పూర్తిచేయాలి. ఆలయ అభివృద్ధికి తోడ్పడాలి. ఇప్పుడు వంతెన పూర్తికాక పోతే మరో ఏడాది వరకు వేచి ఉండాలి. ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి పెంచి వంతెన పూర్తయ్యేలా చూడాలి.

-పదిర నారాయణరావు, కోటిలింగాల ఆలయ చైర్మన్

ఆలయానికి రూ.5 లక్షలు విరాళం



చైర్మన్‌కు చెక్కు అందిస్తున్న దాతలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టే నిత్యాన్నధాన కార్యక్రమానికి దాతలు ఆదివారం ఐదు లక్షల రూపాయల విరాళం అందజేశారు. మంథనికి చెందిన శ్రీరాంభట్ల రాధాకృష్ణ మాధవీలత దంపతులు దేవస్థానం చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డికి చెక్కును అందజేశారు. దాతలకు స్వామివారి శేష వస్త్రం ప్రసాదాలను అందజేశారు. వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వెల్గటూరు: మండలంలోని రాజక్కపల్లి శివారులోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారి స్థావరంపై దాడి చేసి వీరి నుంచి రూ.6150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. పేకాటకు బానిసలయి కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేయొద్దని ఎస్సై సూచించారు. పేకాట ఆడతూ పట్టుపడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ భవనానికి విరాళం



ఎంపీపీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

వెల్గటూరు: వెల్గటూరులో నిర్మిస్తున్న ఆర్‌ఎంపీ ,పీఎంపీ అసోసియేషన్ భవనానికి ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు రూ.1 లక్ష విరాళం ఇస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. స్థానిక హర్ష జూనియర్ కళాశాలలో ఆదివారం ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు విడుదలయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని హంగులతో భవనం నిర్మించుకోవాలని సూచించారు. గ్రామీణులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందచేయాలని కోరారు. ఈ సందర్భంగా విరాళం ప్రకటించునందుకు ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎంపీపీ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జి.మల్లేశ్, ఉపాధ్యక్షులు బైకని రవీందర్, సీపెల్లి శంకర్, నాయకులు దాసరి భీమయ్య, భోగ రాజమౌళి, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు



గొల్లపల్లి: ఈ ఫొటోలో కనిపించేది ధర్మపురి మండలం బుద్దేష్‌పలిలోని నేతకాని వాడలో రోడ్డు. చినుకు పడితే ఈరోడ్డంతా ఇలా తయారవుతుంది. ఈ రోడ్డుపై నడవడం కూడా కష్టమవుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సమస్యను ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం మొరం కూడా పోయించడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలో వాననీరు నిలిచి దోమలు పెరుగుతున్నాయని, జ్వరాలబారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

హలో సాక్షి..
కోరుట్ల : 9440061630, కోరుట్ల టౌన్ : 9948187248, కోరుట్ల రూరల్ : 9441441764, మెట్‌పల్లి : 9848499500, మెట్‌పల్లి రూరల్ : 9440008524, ఇబ్రహీంపట్నం : 9553955661, మల్లాపూర్ : 9949874862, కథలాపూర్ : 9346651478

సాక్షి జగిత్యాల
మన కోరుట్ల
సోమవారం | ఆగస్టు | 28 | 2017



గోతుల మయం



కోరుట్ల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెళ్లే బీటీ రోడ్డు దెబ్బతిని, గుంతలు పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు బీటీ రోడ్డు బాగు చేయాలి.

-మోటూరి సంతోష్‌కుమార్, కోరుట్ల

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.


మా ఫోన్ నంబర్: 9440061630, 9848499500

పంట ధ్వంసం

కోరుట్ల నియోజకవర్గంలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల్లో అడవిపందులు, కోతుల సమూహాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఆరుగాలం కష్టించి పండించిన పంటలతో దిగుబడిని అంతంత మాత్రమే పొందుతున్న అన్నదాతకు సాగు చేసిన పంటలు చేతికి రాకముందే అడవిపందులు, కోతుల మంద పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అప్పులు తెచ్చి అధిక పెట్టుబడులు పెట్టి పండించిన పంట కళ్లముందే అటవీ జంతువుల బారిన పడుతుంటే రైతులు మౌనంగా రోధిస్తున్నారు.







రేగుంటలో ఇటీవల అడవిపందుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు 16 గ్రామాలు ఇబ్రహీపట్నం మండల కేంద్రంతో పాటు 15 గ్రామాలు, మెట్‌పల్లి మండలంలో 6గ్రామాలకు చెందిన రైతులు అటవీ జంతువుల బారిన పడి నష్టాల పాలవుతున్నాడు. ఆయా గ్రామాల్లోని శివారులో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ, మిరపపంటలపై అడవిపందులు, మనువోతులు, కోతుల మంద సమూహంగా దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయని రైతులు విలపిస్తున్నారు. పంటలను రక్షించుకునేందుకు రైతుల కుటుంబసభ్యులు వంతుల వారీగా కాపలా కాస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో పంటలను అటవీ జంతువులు ధ్వంసం చేస్తున్నాయని రైతులు అటవీశాఖ, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను అటవీ జంతువులు పాడు చేస్తుండడంతో దిగుబడి తక్కువై, ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అటవీ జంతువుల నుంచి పంటలను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పరిహారం పొందడం ఇలా..

జీవో 90 ప్రకారం అటవీ జంతువుల వల్ల జరిగిన నష్టానికి పరిహారాన్ని ఇస్తుంది. పంట నష్టం జరిగిన వెంటనే వ్యవసాయ, అటవీ, రెవెన్యూ శాఖాధికారులకు సమాచారం ఇవ్వాలి. అటవీ అధికారులు నష్టపోయిన పంటను పంచనామా చేస్తే, రెవెన్యూ అధికారులు నష్టపోయిన పంట ఆ రైతుదే అని నిర్ధారిస్తారు. వ్యవసాయశాఖ పంట నష్టాన్ని అంచనా వేస్తారు. ఈ మూడు నివేదికలను అటవీశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తే పంట నష్టపరిహారాన్ని రైతులకు ఖాతాలో జమ చేస్తారు.

న్యూస్ బాక్స్

బాయిల్డ్ రైస్‌మిల్లుపై చర్యలు తీసుకోవాలి

కోరుట్లరూరల్: మండలంలోని ఎకీన్‌పూర్ గ్రామం శివారులో ఉన్న శ్రీ సాయి బాయిల్డ్ రైసుమిల్లుపై చర్యలు తీసుకోవాలని ఆదివారం కలెక్టర్ శరత్‌కు గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. రైస్‌మిల్లు నుంచి వచ్చే కలుషిత నీరు, బూడిదతో పొలాలు, గ్రామస్తుల ఆరోగ్యాలు చెడిపోతున్నాయని, దానికి కారణమైన రైస్‌మిల్లుపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు.

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి

మెట్‌పల్లి: సంఘ సేవకురాలు మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను పట్టణంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా 20వార్డులో గల చర్చిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో అధ్యక్షులు నాంపల్లి శ్రీనివాస్‌తో పాటు భృగు మహర్షి, పోలీస్ శ్రీనివాస్, అల్‌రౌండర్ గంగాధర్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతం

కోరుట్లటౌన్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సాయి జీనియస్ హైస్కూల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. లయన్స్ పట్టణ అధ్యక్షుడు ఉషాకిరణ్ మాట్లాడుతూ రేకుర్తి వైద్య బృందం సహకారంతో శిబిరానికి హాజరైన 285 మందిని పరీక్షించి, వారిలో 48 మంది మోతె బిందు ఆపరేషన్లు నిర్వహించుటకు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జక్కని ధనుంజయ్, ప్రతినిధులు భూంరెడ్డి, డాక్టర్ దిలీప్‌రావు, అనీల్, ప్రకాశ్, మధు, పాల్గొన్నారు.

వినాయకుడికి దద్నాభిషేకం

మెట్‌పల్లి: వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజైనా ఆదివారం పట్టణంలోని వాసవీ ఆలయంలో వినాయకునికి ఆర్యవైశ్యులు దద్నాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు సువర్ణ పుష్పార్చనం, మంత్రపుష్పం, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యకమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజ్‌కుమార్, మహాజన్ నర్సింహులు, కిరణ్, పుల్లూరి నవీన్, కోట సుమన్ పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న చైర్మన్ శీలం వేణు

కోరుట్లటౌన్: పర్యావరణం పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ శీలం వేణు అన్నారు. ఆదివారం పట్టణంలోని 25వ వార్డు ఐబి గెస్ట్ హౌజ్ ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనీల్, వైస్ చైర్మన్ రఫీయోద్దిన్, అజీమొద్దిన్, మోసిన్, గంగారాం, శేఖర్, టిఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయమే సృష్టికి జీవనాధారం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ధర్మారంలో ఆదివారం బలరాముని జయంతిని పురస్కరించుకుని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్‌సంఘ్ జిల్లా కార్యదర్శి ఇప్ప రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాతలు పూర్తి సమయాన్ని వ్యవసాయానికి కేటాయించి మానవాళికి అవసరమయిన పంటలను సాగుచేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఆదర్శ రైతులను ఘనంగా సన్మానించారు. ఉపసర్పంచ్ రంజీత్, రైతులు లక్కడి రాజు, నాగిరెడ్డి సుభాష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రామానుజం, తిరుపతి, రాజరెడ్డి పాల్గొన్నారు.



మన కోరుట్ల
సాక్షి జగిత్యాల
సోమవారం | ఆగస్టు | 28 | 2017

ఊరూరా గణనాయకుడు


కోరుట్లటౌన్: విద్యార్థిగా వినాయకుడు


కోరుట్లరూరల్: ఎకీన్‌పూర్‌లో ఎంపీడీవో పూజలు


కోరుట్లటౌన్: కోరుట్ల పట్టణంలోని కొలువుదీరిన గణనాథులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పట్టణంలోని రవీంద్ర రోడ్‌లో నవతరం యూత్ తమ సృజనాత్మక ఆలోచనలతో ప్రకృతి హిత వినాయకున్ని పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదామంటూ వెదురుతో అలంకరించిన గణనాథుడు అందరిని ఆకట్టుకుంటున్నాడు. మట్టితో తయారు చేసిన గణనాథులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. యువతరం సంస్థ పురాణగాథలో దక్షయజ్ఞం అనంతరం అడవిలో తపస్సు చేసే పార్వతీ దేవి తన ఊహల్లో శంకరుని ఆకృతిని తీర్చిదిద్దినట్లు వేసిన సెట్టింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. జవహర్ రోడ్డు శాంతి యూత్ వారు అందరూ చదువుకోవాలని గురువు నేతృత్వంలో ఎలుక ఉపాధ్యాయుడిగా గణపతి పిల్లవాడిగా చదువు నేర్చుకుంటున్నట్లు అలంకరించిన తీరు అందరిని ఆలోచింపజేస్తుంది. స్వాభిమాన్ యూత్ అసోసియేషన్ వారు నిలబెట్టిన డోలుపై భజన చేస్తున్న గణనాథుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాడు.

కోరుట్లరూరల్: మండలంలోని ఎకీన్‌పూర్, సంగెం గ్రామాల్లో వినాయకుని మంటపాల వద్ద ఆదివారం ఉదయం భక్తులు గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఎకీన్‌పూర్‌లో గణపతి పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్రావ్, సుధవేని భూమయ్య, చెప్పాల నర్సయ్య, రమేష్, స్వామి, ప్రశాంత్, మల్లికార్జున యూత్, సంగెం ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండ, భూషన్‌రావుపేట గ్రామాల్లో ఆదివారం వినాయక మంటపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం వినాయకుడి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం యూత్, త్రిశుల యూత్, వివేకనంద యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని 19వార్డు కళానగర్‌లో శ్రీరాం సేన మండపంలో మట్టితో చేసిన వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా నిజామాబాద్‌లో తయారు చేయించిన ఈ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.


కథలాపూర్: వినాయకునితో సంఘం


మెట్‌పల్లి: మట్టి వినాయకుడు


కోరుట్లటౌన్: స్వాభిమాన్ యూత్ గణేశ్


కోరుట్లటౌన్: నవతరం యూత్ గణాథుడు

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ సురేందర్

ఇబ్రహీంపట్నం: హిందువులు, ముస్లింలు శాంతియుతంగా గణేశ్ నిమజ్జనం, బక్రీద్ పండుగలను జరుపుకోవాలని మెట్‌పల్లి సిఐ సురేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనాన్ని నిర్వహకులు రాత్రి 9 గంటల వరకు పూర్తి చేయాలని, 11 రోజుల లోపు నిమజ్జనం చేయాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిమజ్జన ఊరేగింపులో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గణేశ్ మంటపాల వద్ద అశ్లీల పాటలు, డ్యాన్సులు చేయరాదని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండపాల వద్ద పేకాట ఆడితే చర్యలు తప్పవని అన్నారు. డీజేలు పెడితే సీజ్ చేస్తామని తెలిపారు. అల్లర్లకు పాల్పడకుండా నిమజ్జనాన్ని చేసుకోవాలని తెలిపారు. అలాగే ముస్లింలు కూడా రానున్న బక్రీద్ పండుగను శాంతియుతంగా చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సై రామ్ నాయక్, సర్పంచుల ఫోరం నియోజకవర్గం అధ్యక్షుడు జంగస్వామి, సత్యనారాయణ, మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెండితెర



తెలుగు

జయ జానకి నాయకా: లక్ష్మీ (కోరుట్ల)11.30, 2.30, 6.30, 9.30;
నేనే రాజు నేనే మంత్రి : కిన్నెర(కోరుట్ల) 11.30, .30,6.00,9.00;
అర్జున్‌రెడ్డి: సాయికృష్ణ (మెట్‌పల్లి) 11.00, 2.00, 6.00, 9.00;
లై: లక్ష్మీ (మెట్‌పల్లి) 11.00,

లోకల్ వాయిస్

ఎల్‌ఈడీ లైట్లు పెట్టాలి



పట్టణంలోని విద్యుత్ స్తంభాలకు ఎల్ ఈడీ లైట్స్ ఏర్పాటు చేయాలి. వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా అన్ని రహదారుల్లో విద్యుత్ లైట్లు వెలిగేందుకు చొరవ చూపాలి. అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలు వేయాలి. విద్యుత్ వైర్లు కిందికి వేలాడుకుండా చూడాలి.

-గెల్లె గంగాధర్, గంగంపేట, కోరుట్ల

పందుల బెడదతో తంటాలు



ఆనందనగర్‌లో ఆనందం కరువైంది. మా ప్రాంతంలో పందులతో తంటాలు పడ్తున్నాం. మున్సిపల్ వారు పందులను గ్రామానికి దూరంగా పంపిస్తామన్నారు. ఇప్పటికీ ఇళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. మెదడువాపు వ్యాధి వస్తదని భయపడ్తున్నాం. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

-కైరంకొండ ప్రసాద్, ఆనందనగర్, కోరుట్ల

Zone Guide

వీఆర్వోల సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2.30గం‘‘లకు విఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాజేశ్వర్ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు.

సిలిండర్ల సరఫరా

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి, సాతారం, గుండంపల్లి, రేగుంట, వెంకట్రావ్‌పేట గొర్రెపల్లి గ్రామాలలో సోమవారం సిలిండర్లను సరఫరా చేయనున్నట్లు సోమగిరి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహకుడు తోట రాజం తెలిపారు.

విద్యుత్ బిల్లుల వసూలు

మల్లాపూర్: మండలంలోని రాఘవపేట, మొగిలిపేట, మల్లాపూర్, కొత్త దాంరాజుపల్లి, సాతారం, ముత్యంపేట గ్రామాలలో సోమవారం విద్యుత్ బిల్లులు వసూలు చేయనున్నట్లు టీఎస్ ట్రాన్స్‌కో ఏఈ మనోహర్ తెలిపారు.

ఇంటర్వ్యూ



సాయిప్రణీత్
అంశం : తాగునీరు
మున్సిపల్ ఇంజనీర్

మెట్‌పల్లి:

ప్రశ్న: పట్టణంలో ఉన్న మొత్తం నల్లా కనెక్షన్లు.?
జవాబు: 24వార్డులు కలుపుకొని మొత్తం 3759 కనెక్షన్లు ఉన్నాయి. వీటికి ఆరపేట వాగుతో పాటు పలు చోట్ల ఏర్పాటు చేసిన బోర్ల ద్వారా ట్యాంకులను నింపి నీటిని సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: నీటి శుద్ధి విషయంలో ఏం చర్యలు తీసుకుంటున్నారు.?
జవాబు: తరుచుగా ట్యాంకులను శుభ్రంతో చేయడంతో పాటు నిత్యం నీటిని క్లోరినేషన్ చేసి నల్లాల ద్వారా అందజేస్తున్నాం.

ప్రశ్న: కొన్ని ప్రాంతాల్లో మురికి నీరు వస్తోందని ఆరోపణలున్నాయి. ఏం చర్యలు తీసుకుంటున్నారు?
జవాబు: పైపుల లీకేజీ వల్ల మురికి నీరు వచ్చే అవకాశముంటుంది. సమాచారమిస్తే వెంటనే మరమ్మతులు చేపడుతున్నాం.

ప్రశ్న: పలు వార్డుల్లో నల్లా కనెక్షన్లు లే క ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త కనెక్షన్లు ఎప్పుడు ఇస్తారు.?
జవాబు: శివారు కాలనీల్లో నల్లా కనెక్షన్లు లేవు. మిషన్ భగీరథలో భాగంగా ప్రతి ఇంటికి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నాం.

కొత్త కొత్తగా..

ఇంజినీరింగ్ అదో సరికొత్త ప్రపంచం. పుష్కరకాల విద్యాభ్యాసంలో కనీవిని ఎరుగని కొత్త పరిసరాలు. సహచర విద్యార్థుల పరిచయాలు. మూడేళ్ల సీనియర్ల చిలిపి అల్లర్లు. అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల హుందాతనం. సరికొత్తల్యాబ్‌లు. ఇలా ఇంజినీరింగ్ కళాశాలలు కొత్తకొత్తగా ఉంటాయి. ఇంటర్ పూర్తి చేసుకుని జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని విద్యార్థులు సరికొత్త ఆశలతో నెలరోజుల క్రితం ఇంజినీరింగ్‌లో అడుగు పెట్టారు. ఈ సందర్భంగా వారి అనుభూతులపై కథనం..

- కొత్త పరిసరాలు.. సరికొత్త పరిచయాలు
- ఇంజినీరింగ్‌లో అడుగుపెట్టిన ఫ్రెషర్స్
- లక్ష్యంవైపు తొలి అడుగు
- సీనియర్లు.. అధ్యాపకుల సహకారం
- విజయతీరాలకు చేరుతామంటున్న 'టెక్' స్టూడెంట్స్


పరిచయం చేసుకుంటున్న విద్యార్థులు

అల్గునూర్(మానకొండూర్): తిమ్మాపూర్ శివారులో శ్రీచైతన్య, వాగేశ్వరి, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో ట్రిపుల్‌ఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్, కంప్యూటర్స్ కోర్సులు ఉన్నాయి. ప్రతీ కోర్సులో 60 మంది చొప్పున ప్రతీ కళాశాలలో ఈసారి 500 మంది విద్యార్థులు అడుగు పెట్టారు. మూడు కళాశాలల్లో కలిసి 1500 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు.

క్యాంపస్‌లో కొత్తకొత్తగా..

ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్నో ఆశలతో అడుగు పెట్టిన ఫస్టియర్ విద్యార్థులకు ఆయా కళాశాలలు అందమైన మొక్కలు, పచ్చని వాతావరణం స్వాగతం పలుకుతున్నాయి. విశాలమైన క్యాంపస్ పరిసరాలు వారిలో టెన్షన్ తొలగిపోయేలా చేస్తున్నాయి.

సీనియర్ల స్వాగతం

ఆయా కళాశాలల్లో చదువుతున్న సీనియర్ ఇంజినీరింగ్ విద్యార్థులు జూనియర్లకు సాదర స్వాగతం పలుకుతున్నారు. ఇంజినీరింగ్ అంటే సీనియర్ల ర్యాగింగ్, వేధింపులు ఉంటాయనుకున్న కొత్త విద్యార్థులు సీనియర్లు అందిస్తున్న సహకారం చూసి ఆశ్చర్యపోతున్నారు.

సీనియర్లతో పరిచయం

జూనియర్లు, సీనియర్లు పరిచయం చేసుకుంటున్నారు. సీనియర్లే జూనియర్ల తరగతి గదులకు వెళ్లి.. ప్రతీ విద్యార్థి నిర్భయంగా మాట్లాడేలా ప్రోత్సహిస్తున్నారు.. పరిచయం కొత్తగా, వినూత్నంగా ఉండాలని సూచిస్తున్నారు. కొత్తకొత్త ఆలోచనలు, భావన, ఊహలకు అవకాశం కల్పిస్తున్నారు.

అనుభవ పాఠాలు పంచుతూ..

సీనియర్లు మూడేళ్లుగా కళాశాలలో తాము నేర్చుకున్న పాఠాలు, అనుభవాలు జూనియర్లకు వివరిస్తున్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. తాము నేర్చుకున్న పాఠాలు, రికార్డులు, రైటింగ్ నోట్స్ అందించి వారికి ఉపయోగకరమైన అంశాల తెలియజేస్తున్నారు.

అధ్యాపకుల దిశానిర్దేశం

ఉన్నత లక్ష్యం.. అత్యున్నత ఆశయంలో కళాశాలలో అడుగుపెట్టిన నూతన విద్యార్థులకు ఆయా కళాశాలల్లోని అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రతీ విద్యార్థితో ముఖాముఖి పరిచయం చేసుకుని వారి లక్ష్యాన్ని, కుటుంబ నేపథ్యం గురించి తెలుసుకుంటున్నారు. ఆందోళన, భయం, టెన్షన్ ఫీల్‌అవుతున్నవారికి సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. గమ్యం వైపు ధైర్యంగా సాగేలా ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్‌లో అవకాశాల గురించి వివరిస్తున్నారు.


నాన్న ఆశయం నెరవేరుస్తా



మా స్వగ్రామం జగిత్యాల జిల్లా సారంగాపూర్. మానాన్న స్వామిరెడ్డిరైతు. మేము ఇద్దరం అన్నదమ్ములం. మమ్మల్ని ఉన్నత స్థితిలో చూడాలనేది నాన్న ఆశయం. ఆయన ఆశయం నెరవేరుస్తా. మెకానికల్ ఇంజినీర్ అవుతా.

– పి.రాకేశ్, మెకానికల్, వాగేశ్వరి కళాశాల

అమ్మానాన్నల కష్టం తీరుస్తా



మాది చొప్పదండి. అమ్మానాన్న వ్యవసాయం చేస్తూ కష్టపడి నన్ను చదివిస్తున్నారు. చిన్నతనం నుంచి మాకోసం వాళ్లు నిరంతరం శ్రమిస్తున్నారు. నేను బీటెక్ పూర్తిచేసి మంచి ఉద్యోగం సాధించి అమ్మానాన్న కష్టాలు తీరుస్తా.

– జాహ్నవి, సీఎస్‌ఈ, జ్యోతిష్మతి కళాశాల

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



మా స్వగ్రామం కొత్తపల్లి. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నాలక్ష్యం. టెక్నికల్ కోర్సులు చదవితే మంచి ఉద్యోగం వస్తుందనే ఈసీఈ కోర్సులో జాయిన్ అయ్యాను. కళాశాల వాతావరణం బాగుంది. సీనియర్లు సహకారం అందిస్తున్నారు.

– సాయిశ్రీజ, ఈసీఈ, శ్రీచైతన్య కళాశాల

కొత్త ఆవిష్కరణలకు ఆస్కారం



మన ఆలోచనలో కొత్తగా ఉండాలని ఎప్పుడూ మానాన్న అంటుంటారు. అందుకే నేను బీటెక్‌లో సివిల్ ఇంజినీరింగ్ కోర్సు ఎంచుకున్న. ఉన్నత చదువు చదివి నూతననిర్మాణాలు చేపడతా. మా కాలేజీలో సీనియర్ల ప్రోత్సాహం బాగుంది.

– సాహిత్య, సివిల్, శ్రీచైతన్య కళాశాల

విజయోస్తు...



కొత్తగా ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులు బీటెక్ విద్య ఇంతవరకు చదివిన చదువుకు చాలా భిన్నమైనది. ఇంటర్‌లో నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేర్చుకునే సదావకాశం ఇది. మన కోసం తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారనే ఆలోచన మదిలో ఉండాలి. లక్ష్యం నిత్యం మన కళలో మెదలాలి. అప్పుడే విజయం మన దరిచేరుతుంది.

– జువ్వాడి సాగర్‌రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్

కలలు నిజం చేసుకోవాలి..



ప్రతీ విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలి. మా కళాశాలలో బీటెక్ ఫస్టియర్‌లో చేరిన విద్యార్థులంతా లక్ష్యసాధనకు మార్గాలు అన్వేశిస్తూ ఇక్కడకు వచ్చారని భావిస్తున్నాం. వారు గోల్ రీచ్‌కావడానికి సాకారం అందిస్తాం.విద్యార్థి వేసే ప్రతీ అడుగును నిశితంగా గమనిస్తాం.విజయ తీరాలకు చేరుస్తాం.

– గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, వాగేశ్వరి విద్యాసంస్థల కరస్పాండెంట్

ఉన్నత భవిత



ఉన్నత లక్ష్యంతో ఇంజినీరింగ్ చదివేందుకు మా కళాశాలలో అడుగు పెట్టిన ప్రతీ విద్యార్థి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుతాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కన్న కలలు, వారి ఆకాంక్షలు అధ్యయనం చేస్తాం. ప్రతీ విద్యార్థి శక్తి సామర్థ్యాలను అంచనా వేస్తాం. ఆదిశగా బోధన అందిస్తాం.

– ముద్దసాని రమేశ్‌రెడ్డి, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్



లోకాన్ని చూపిద్దాం

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం'.. అన్నారు పెద్దలు. అందమైన సృష్టిని చూడాలంటే కంటిచూపు ముఖ్యం. చీకట్లో మగ్గుతున్న వారెందరో కంటిచూపు కోసం ఎదురు చూస్తున్నారు. మనం మరణించిన తరువాత నేత్రాలు వృథాగా మట్టిలో కలవకుండా, బూడిద కాకుండా.. మరొకరిచి చూపునిద్దాం. మనకళ్లకు పునర్జన్మను ప్రసాదిద్దాం. దివంగత రాజీవ్‌గాంధీ, సోనియా గాంధీ 1986 ఆగస్టు 25న మొట్టమొదటి సారిగా నేత్రదాన వాగ్దానం చేశారు. నాటి నుంచి ఏటా దేశవ్యాప్తంగా జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన పక్షోత్సవాలు సెప్టెంబర్8 వరకు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి' కథనం..

- ఒకరిగా మరణించి... ఇద్దరిగా జీవిద్దాం
- అంధులకు కంటి చూపును ప్రసాదిద్దాం
- విస్తృత ప్రచారం చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- ప్రారంభమైన 'జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు'

కోల్‌సిటీ/కొత్తపల్లి: దేశంలో ఏటా కోటి మందికిపైగా వివిధ కారణాలతో మృతి చెందుతున్నారు. 12 లక్షల పైచిలుకు మంది కార్నియా అంధత్వంతో బాధపడుతున్నారు. వీరిలో 60శాతం 12 సంవత్సరాలోపు చిన్నారులే ఉన్నారనే నివేదికలు కలవర పెడుతున్నాయి. వీరంతా కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఏటా 25వేల కొత్త కేసులు నమోదవుతున్నాయి. రెండు లక్షనేత్రాలు అవసరముంటే కేవలం 40వేల నేత్రాలను సేకరిస్తున్నారు. నేత్రదానంలో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉండగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెండో స్థానం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ సంస్థల ద్వారా 6 వేలకు పైగా నేత్రాదాన అంగీకర పత్రాలు సేకరించారు. 3100కు పైగా నేత్రాలు సేకరించారు.

కార్నియల్ అంధత్వం అంటే...

కంటి కనుపాపపై అద్దంలా కనిపించే పొరనే కార్నియా(శుక్ల పటలం) అంటారు. కంటి వ్యాధి సోకినా, గాయమైనా కార్నియా చెడిపోతే కంటి చూపు మందగించడం, కొన్ని సందర్భాల్లో చూపును కోల్పోవడం జరుగుతుంది. దెబ్బ తగలడం, పౌష్టికాహారం తీసుకోకపోవడం, వంశపారంగా సంక్రమించే వ్యాధి, గాయాలు, ఇన్‌ఫెక్షన్ తదితర కారణాలతో కంటి చూపు మసకబారుతుంది. దానం చేసిన నేత్రం ద్వారా కార్నియా మార్పిడితో, పోగొట్టుకున్న కంటి చూపును తిరిగి పొందవచ్చు.

ఒకరి నేత్రాలు.. ఇద్దరికి చూపు

ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చు. 6 గంటల లోపు మరణించిన వ్యక్తి నేత్రాలు సేకరించాలి. నేత్రదానం చేయడానికి వయస్సు పరిమితి లేవు. మరణించిన వ్యక్తి నేత్రాల్లోని కార్నియాను స్టెరైల్ పద్ధతి ద్వారా అనుభవజ్ఞులైన ఆఫ్థాలిమిక్ అసిస్టెంట్లు లేదంటే శిక్షణ పొందిన వైద్యసిబ్బంది సేకరిస్తారు. మరణించిన వ్యక్తి కంట్లోని టిష్యూ తడిగా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలి. నేత్రదానం చేయాలనుకున్న వారు దగ్గరలోని స్వచ్ఛందసంస్థలకు, ఐబ్యాంక్‌లకు సమాచారం ఇవ్వాలి. మరణించిన వ్యక్తి ఇదివరకే నేత్రాలు దానం చేస్తున్నట్లు ప్రతిజ్ఞ చేసినా, చెయ్యకపోయినా వారి కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను తీసుకోవచ్చు.

వృత్తి ఇంజినీర్.. ప్రవృత్తి సమాజసేవ



కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన కోల అన్నారెడ్డిది వృత్తి ఇంజినీర్. ప్రవృత్తి సమాజసేవ. ఇంజినీర్‌గా లయన్స్, అలయన్స్ క్లబ్స్, రెడ్‌క్రాస్ సంస్థ, రేకుర్తి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి ట్రస్టు బోర్డు సభ్యుడిగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 4 వేలకు పైగా నేత్రాలను సేకరించారు. చూపులేని వారికి కంటిపాపగా నిలుస్తున్నారు.2017లో న్యూఢిల్లీకి చెందిన స్వచ్ఛందసంస్థ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్సీ అవార్డు, 2016లోలయన్స్ క్లబ్, అలయన్స్ క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీల షైనింగ్ స్టార్ అవార్డు, 2014లో రాజీవ్‌గాంధీ గోల్డ్‌మెడల్, 2012లో అప్పటి కేంద్రమంత్రి చిరంజీవిచే ప్రశంసా పత్రం, 2012లో పీఎంజీఎఫ్ అవార్డు అందుకున్నారు.


మరణించిన వ్యక్తినుంచి నేత్రాలు స్వీకరిస్తున్న వైద్యులు


కోల అన్నారెడ్డికి సన్మానం (ఫైల్)

దానం చేసిన కళ్లు విక్రయించొద్దు

మనదేశంలో దానం చేసిన కళ్లకు కొరత ఏర్పడింది. కళ్లను తొలగించిన తర్వాత వాటిని ఐ బ్యాంకులో విశ్లేషించి ప్రాసెస్ చేస్తారు. కార్నియాను 96 గంటలలోపు ట్రాన్స్‌ప్లాంట్ చేస్తారు. ఐ బ్యాంకులు మానవ అవయవ మార్పిడి చట్టం పరిధిలోకి వస్తాయి. దానం చేసిన కళ్లను కొనరాదు, విక్రయించరాదు. అది చట్ట ప్రకారం నేరం.

విస్తృత ప్రచారం...

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని పలు స్వచ్ఛంద సంస్థలు నేత్రదానం ఆవశ్యకతపై కరపత్రాలు, సినిమా స్లైడ్స్. గోడప్రతులు ద్వారా ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థలు, కరీంనగర్‌లో రేకుర్తి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నారు. గోదావరిఖనికి చెందిన 'సదాశయ ఆర్గాన్ ఫౌండేషన్' సంస్థ విస్తృత ప్రచారం చేస్తోంది.

నేత్రాలు సేకరించే సంస్థలు

- జిల్లా ప్రధానాస్పత్రి నేత్రదాన సేకరణ కేంద్రం: 0878-2240337
- లయన్స్ క్లబ్ ఉదార కంటి ఆస్పత్రి రేకుర్తి, కొత్తపల్లి మండలం: 0878-2253131, 2285318
- లయన్ కోల అన్నారెడ్డి, నేత్రవైద్యశాల ట్రస్టుబోర్డు సభ్యుడు: 9849059538
- టి.శ్రవణ్‌కుమార్, సదాశయ ఆర్గాన్ ఫౌండేషన్, గోదావరిఖని: 9848609591
- తానిపర్తి గోపాల్‌రావు, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, నేత్రాల సేకరణ ఇన్‌చార్జి: 9849084589
- ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ హైదరాబాద్: 9849545822, 040-23548266
- ఐ బ్యాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ: టోల్‌ఫ్రీ 1919/1053

నేత్రదానానికి ప్రతిజ్ఞ చేశా



మరణానంతరం నా రెండు కళ్లు దానం చేయ్యడానికి 2014 ఆగస్టులో ప్రతిజ్ఞ చేశా. చూపులేని అంధులను చూస్తుంటే బాధగా ఉంటుంది. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన రావాలి. ప్రతీ ఒక్కరూ నేత్రాలు దానం చేయడానికి ముందుకు రావాలి.

– కొంకటి లక్ష్మీనారాయణ, రామగుండం నగర మేయర్

220 మందికి చూపునిచ్చాం



సదాశయ ఆర్గాన్ ఫౌండేషన్ ద్వారా 400కు పైగా కార్యక్రమాలు చేపట్టడంతో నేత్ర, అవయవదానంపై వేలాది మంది ముందుకు వచ్చారు. ఇప్పటి వరకు మరణించిన 110 మంది నుంచి కార్నియాలను సేకరించి. 220 మందికి కంటి చూపును అందించడానికి కృషి చేశాం.

– టి.శ్రవణ్‌కుమార్, గోదావరిఖని

ప్రత్యేక చట్టం రావాలి



మనిషి మరణించాక కళ్లు వృథాకాకుండా నేత్రదానం చేయండి. ఇందు కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. కొన్ని దేశాల్లో మృతదేహాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అవయవాలను మరొకరిని అమర్చుతుంది. ఈ దిశగా కృషి చేయాలి.

– డి.నిరంజన్, నేత్ర వైద్యనిపుణులు